


ఒంగోలు బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద దిగజారిన నీటిమట్టం

సాగర్ కాలువలకు అరకొరగా సాగునీరు సరఫరా అవుతోంది. చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్లు, మైనర్లకు నీరందటం లేదు. చివరి ఆయకట్టు భూముల్లో వరి నాట్లు వేసుకోవటంలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరద నీటి లెక్కలో ఉచితంగా నీరు వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు సద్వినియోగపర్చటం లేదు. ఇటీవల తుఫాన్ సమయంలో కాలువలు తెగిపోతాయనే ఉద్దేశంతో సాగునీటి సరఫరాను నిలిపివేశారు. వర్షాలు ఆగిపోయి గత నాలుగు రోజులుగా ముమ్మరంగా ఎండలు కాస్తున్నాయి. పంటల సాగుకు మళ్లీ కుడికాలువకు సాగునీటిని పునరుద్ధరించారు. అయినా మేజర్లకు అవసరమైన స్థాయిలో నీరు రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

అరకొరతో అయోమయం

- సాగునీటి సరఫరాలో గందరగోళం
- మేజర్లకు అందక ఇబ్బందులు
- చివరి భూముల్లో మాగాణికి జాప్యం
- ఆందోళన చెందుతున్న రైతులు

సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెంచాలి



ఒంగోలు బ్రాంచ్ కాలువలకు తక్కువగా నీరు విడుదల అవుతున్నందున మేజర్లకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చివరి భూముల్లో ఇంకా వరినాట్లు కొనసాగుతున్నాయి. త్వరితగతిన వరినాట్లు పూర్తి చేసుకునేందుకు చివరి ప్రాంతాలకు నీటి పరిమాణం పెంచాలని అధికారులకు సూచించాం.

- కె.వెలిగొండారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, దర్శి

సాగునీరు సక్రమంగా అందక ఇబ్బంది పడుతున్నాం



సాగునీరు సక్రమంగా అందక ఇబ్బంది పడుతున్నాం. చివరి భూములకు నీరుచేరక వరినాట్లు ముందుకు సాగటం లేదు. గతంలో సాగు చేసిన వరిపైరుకు కూడా నీరు పారించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. నాలుగు రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తుండటంతో మాగాణి భూములు ఆరిపోయాయి. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి అన్ని మేజర్లకూ నీరందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- ఆకుల రాంబాబు, రైతు, చెరువుకొమ్ముపాలెం

దర్శి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ సమయంలో త్రిపురాంతకం మండలంలో గండిపడిన నేపథ్యంలో సాగర్ కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయడం లేదు. అక్కడ మరమ్మతు పనులు పూర్తయినా పెద్దగా నీరు కిందకు రావడం లేదు. కీలక సమయంలో అరకొరగా నీరు వస్తుండటంతో ఆయకట్టులో సాగుకు ఇబ్బంది ఎదురవుతోంది. వరినాట్లతోపాటు ఇప్పటికే వేసిన పైరుకు సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికీ కృష్ణానది వరద కొనసాగుతుండటంతో సాగర్ జలాశయం నుంచి కిందకు నీరు విడుదల చేస్తున్నారు. వరద నీరు కిందకు విడుదల చేసే సమయంలో కుడి, ఎడమ కాలువలకు వాడుకునే నీరు వాటాల లెక్కలోకి రాదు. నిబంధనల ప్రకారం సాధారణ పరిస్థితుల్లో కృష్ణాబోర్డు నిర్ణయించిన

మిగతా 6లో...

సాగునీటి పంపిణీ వివరాలు

సాగర్ కుడికాలువకు డ్యామ్ నుంచి పదివేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా బుగ్గవాగుకు చేరుతుంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9,060 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. గుంటూరు జిల్లా రైతులు అధిక నీరు వాడుకోవటంతో ప్రకాశం జిల్లాకు తక్కువ నీరు సరఫరా అవుతోంది. సాగర్ ప్రధాన కాలువ 95/3వ మైలుకు (ప్రకాశం బార్డర్) 2,269 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. ఆ నీటిని దర్శి బ్రాంచ్ కాలువ పరిధిలోని రైతులు వాడుకోగా, పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 462 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 568 క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు. అందువల్ల మేజర్లు, మైనర్లకు నీరందటం లేదు. ఇటీవల పూడిక తీసినందున సాగర్ కాలువలో లోతు పెరిగింది. దీంతో ప్రస్తుతం ఓబీసీకి కనీసం 800 క్యూసెక్కులు తగ్గకుండా నీరు విడుదల చేస్తేనే అన్ని మేజర్లు, మైనర్లకు నీరందుతుంది. ఇరిగేషన్ అధికారులు ఈ విషయాన్ని గుర్తించకపోవంతో ఒంగోలు బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్లకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



జలకళతో మార్కాపురం చెరువు

తొలగిన అవాంతరాలు

- చెరువు నీటి వనరులకు యుద్ధప్రాతిపదికన పనులు
- అలుగు పారేందుకు అడుగు దూరంలో చెరువు

మార్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మార్కాపురం చెరువు నిండేందుకు మార్గం సుగమమైంది. మొంథా తుఫాన్ ప్రభావంతో డివిజన్‌లోని అన్ని చెరువులు నిండినా మార్కాపురం చెరువుకు మాత్రం కొద్దిపాటి నీరు మాత్రమే చేరింది. ఈ విషయాన్ని గమనించిన ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు నీరు చేరేందుకు ఏర్పడిన అవాంతరాలను గుర్తించారు. వెంటనే క్షేత్రస్థాయిలో పనులు యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టారు. చెరువుకు ప్రధాన వనరైన సప్లై చానల్‌కు మూడుచోట్ల పడిన గండ్లను పూడ్చివేశారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను, చెత్తను కూడా యంత్రాల సహాయంతో తొలగించారు. దీంతో ప్రస్తుతం చెరువుకు వేగంగా నీరందుతోంది. మొండివాగు, నల్లవాగు, ఎర్రవాగులపై కూడా దృష్టిపెట్టి పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం మరో అడుగుమేర నీరు చెరువులోకి చేరితే అలుగు పారనుంది. గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మరో వారంలోపు చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. నాలుగేళ్ల తర్వాత చెరువు నిండుతుందని తెలిసి పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో చురుగ్గా పనులు

మొంథా తుఫాన్ సమయంలో అన్నిచోట్లా చెరువులు నిండాయి. అత్యంత కీలకమైన మార్కాపురం చెరువుకు కొద్దిపాటి నీరు మాత్రమే వచ్చింది. ఒక పక్క గుండ్లకమ్మ గతంలో ఎన్నడూలేని విధంగా ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహిస్తున్నా నీరు తగినంత రాలేదు. దీంతో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వెంటనే ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు వనరులన్నింటినీ పరిశీలించారు. ప్రధానంగా మాల్యవంతునిపాడు నుంచి కొండేపల్లి మీదుగా ఉన్న సప్లై చానల్‌కు పలుచోట్ల గండ్లు పడి, లీకులు ఉండటాన్ని గమనించారు. పలు బ్రిడ్జిల వద్ద చెత్తాచెదారం

మిగతా 6లో...



కొండేపల్లి గ్రామం వద్ద జరుగుతున్న కాలువ గండి పూడ్చివేత పనులు

టెన్త్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- నవంబరు ఆఖరుకు సిలబస్ పూర్తికి ఆదేశం

ఒంగోలు విద్య, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జిల్లాలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. గతంలో కంటే మెరుగైన ఫలితాల సాధనపైనే గురిపెట్టింది. అందులో భాగంగా టెన్త్ విద్యార్థులకు ఈ నెల 30నాటికి సిలబస్ పూర్తిచేయాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. ఈనెల 15 నాటికి ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షల్లో సాధించిన మార్కులను విశ్లేషించి పాఠశాలల వారీగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించమన్నారు. డిసెంబరు నుంచి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను అమలు చేయనున్నారు. ఎస్సీఈఆర్టీ ద్వారా ఈ ప్రణాళికను పాఠశాలలకు అందజేస్తారు. విద్యార్థులకు సిలబస్ రివిజన్‌తోపాటు వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ వారిని పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు. పాఠశాలల వారీగా గతంలో సాధించిన ఫలితాలను సమీక్షించి దాని కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికతో ముందుకుసాగాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాగా హైస్కూళ్లలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి ఆఖరుకు సిలబస్ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తరహాలో 9వ తరగతి విద్యార్థులకు వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 10వ తరగతి సిలబస్‌ను ప్రారంభించాలని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఒంగోలు, కొత్తపట్నం మండలాలకు కేంద్ర బృందం

- ఈనెల 11 పర్యటన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 11వ తేదీన కేంద్ర బృందం పర్యటించనుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలను పరిశీలించేందుకు ఈ బృందం జిల్లాకు వస్తుంది. ఆరోజు ఉదయం ఏడున్నర గంటలకు విజయవాడలో బయలుదేరి పది గంటలకు ఒంగోలు చేరుకుంటారు. 11 గంటలకు వర్షాలకు జరిగిన నష్టాలపై జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రమైన నాగులుప్పలపాడు, ఒమ్మెవరం గ్రామాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కొత్తపట్నం మండలం అల్లూరులో పర్యటించి అక్కడ నష్టాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంగోలులో భోజనం చేసుకొని విజయవాడకు కేంద్ర బృందం వెళ్లనుంది. ఆ మేరకు షెడ్యూల్ ఖరారు కావడంతో సంబంధిత శాఖల అధికారులు అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

సరిహద్దుతో సతమతం

- ఒక గ్రామం రెండు జిల్లాల పరిధిలో ..
- రహదారికి ఓ వైపు ప్రకాశం జిల్లా రెండో వైపు పల్నాడు జిల్లా
- అవే గాజులపాలెం.. గార్లదిన్నెలు...
- అభివృద్ధికి అడ్డంకిగా పరిధులు
- కొత్త జిల్లా ఏర్పాటులోనైనా సమస్యను పరిష్కరించాలని ప్రజల వినతి

7



స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో

నిర్లక్ష్యం

- ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా వ్యవహారాలు
- ఇంటికి యజమాని ఫోన్ నెంబర్ కాకుండా ఇతరుల నెంబర్లు
- సీరియస్‌గా పరిగణిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్
- ఇప్పటికే కార్యదర్శి సస్పెన్షన్, మరో నలుగురికి షోకాజ్ నోటీసులు
- తప్పులు సరిచేసేందుకు మరోసారి అవకాశం కల్పించిన వైనం
- ఈసారి అలా చేస్తే వేటు తప్పదని హెచ్చరికలు



కందులూరులో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు (ఫైల్)

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో జిల్లాలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆస్తి హక్కు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు పంచాయతీ కార్యదర్శులు తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు, స్థలాల(అసెస్‌మెంట్లు)కు పంచాయతీలకు పన్నులు చెల్లిస్తున్నా ఆ ఇంటి, స్థల యజమానులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు. అయితే ప్రస్తుతం గృహాలకు, స్థలాలకు హక్కులు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం స్వర్ణ పంచాయతీల డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించింది. ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు గృహాలు, స్థలాలు గుర్తించి ఆ ఇంటి యజమాని ఫోన్ నెంబర్‌తోపాటు ఆధార్ నెంబర్‌ను కూడా నమోదు చేయాల్సి ఉంది. అయితే జిల్లాలోని అనేక పంచాయతీల్లో కార్యదర్శులు ఇంటి యజమాని ఫోన్ నెంబర్లు కాకుండా ఇతరులవి వేసిన విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ గుర్తించారు. అలా రాష్ట్రవ్యాప్తంగా తప్పులతడకగా ఇష్టానుసారంగా ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు నమోదు చేసినట్లు గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్

మిగతా 6లో...

వెలుగులోకి వెలుగోటి శాసనం

- ఎమ్మెల్యే స్వగ్రామంలోని గుడిలో గుర్తింపు
- కొమరవెల్లిగా పిలిచే నేటి కొమరోలు
- ఆలయ నిర్వహణలో అశోక్‌రెడ్డి కుటుంబం

కొమరోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్వగ్రామం కొమరోలు మండలం హనుమంతరాయునిపల్లి గ్రామంలో వెలసిన వీరాంజనేయస్వామి దేవాలయంలో పురాతన తెలుగు శాసనం ఇటీవల గుడి మరమ్మతు పనుల్లో వెలుగుచూసింది. కొమరోలు ఆవిర్భావానికి సంబంధించిన శాసనమని తేలింది. నాడు కొమరవెల్లిగా పిలిచినదే నేడు కొమరోలుగా మారింది. ఈ ఆసక్తికరమైన విషయాన్ని తెలియజేసే 17వ శతాబ్దానికి చెందిన ఈ శిలాశాసనాన్ని ఆలయ ఆవరణలో గుర్తించారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని బొంగరాలతిప్పగా పిలిచేవారు. ఈ ప్రాంతాన్ని వెలుగోటి పెద్దలు తిరుపతినాయుని కుమారుడు కోటప్పనాయుడు ద్వారా హనుమంతదేవునికి సేవలు నిర్వహించేందుకుగాను గనుకులపల్లి, బొమ్మగారపొట్టి గ్రామాల్లోని కొన్ని భూములను బహుమతిగా ఇచ్చారు. నల్లమల ప్రాంతాన్ని వెలుగోటి వంశస్తులైన కొండప్పనాయుడు పాలిస్తుండగా, ఆయన కుమారుడు తెలుగునాయుడు ఈ ప్రాంతాన్ని పర్యవేక్షించేవారు. అమర నాయంకరుని ఆధీనంలో ఉన్న కొమరవెల్లిని రంగపతిరాజు స్వాధీనం చేసుకున్న తర్వాత కొమరోలుగా నామకరణం చేయగా నేటికీ అదే ప్రాచుర్యంలో ఉందని అద్దంకి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి వివరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇక్కడి అభయాంజనేయ స్వామి ఆలయ నిర్వహణ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నడుస్తుండగా పూజాది ఉత్సవ కార్యక్రమాలు, నిత్య ధూపదీప నైవేద్యాలు జరుగుతున్నాయి.



శిలాశాసనం



ఆంజనేయ స్వామి గుడి

11న జిల్లాకు సీఎం

- కనిగిరి నియోజకవర్గం లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం
- ప్రాథమిక ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఉగ్ర దృష్టి
- నేడు మంత్రి స్వామి, కలెక్టర్ పర్యటన

ఒంగోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఈనెల 11న కనిగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆ మేరకు ఇటు కీలక ప్రజాప్రతిధులకు, అటు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. తొలుత ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలలో ఒకచోట పర్యటన కోసం పరిశీలించాలని సీఎం కార్యాలయం నుంచి శనివారం మధ్యాహ్నం సమాచారం వచ్చింది. సాయంత్రానికి కనిగిరి నియోజకవర్గం ఖరారు చేశారు. పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కును ఆయన ప్రారంభించనున్నారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో 50 ఎకరాలలో అక్కడ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా శ్రీకారం చుట్టారు. కొంతభాగం పనులు జరిగాయి. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్న సీఎం చంద్రబాబునాయుడు భూములు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈనేపథ్యంలో కనిగిరి నియోజకవర్గంలో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. సీఎం పర్యటన సమాచారం అందుకున్న వెంటనే కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సంబంధిత పనులపై దృష్టిసారించారు. స్థానిక అధికారులు, ముఖ్య నాయకులతో కలిసి శనివారం సాయంత్రం ఎంఎస్ఎంఈ పార్కు ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రాథమికంగా తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ తదితరులు ఆ ప్రాంతాన్ని ఆదివారం సందర్శించనున్నారు. అక్కడి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో కలిసి అక్కడ ఏర్పాట్లును పరిశీలిస్తారు. అనంతరం సీఎం పర్యటన షెడ్యూల్‌పై స్పష్టత రానుంది.

అధికారులు, నాయకులతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి





కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు, సంఘాల నాయకులు

భక్తిభావాన్ని పెంపొందించిన కనకదాసు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక కవి,తత్వవేత్త కనకదాసు తన కీర్తనల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందింపజేశారని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కనకదాసు చిత్రపటానికి డీఆర్వోతో పాటు బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలజ్యోతి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు ఆయాశాఖల సిబ్బంది, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎల్. నాగేశ్వరరావు, రాచూరి శ్రీనివాసరావు, లంబు రాజేంద్ర, బక్కా సాంబశివరావు, బోలే శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మెప్మా ఉద్యోగులకు సీఎంఎం బెదిరింపులు

● ఆంధ్రజ్యోతికి సమాచారం ఎలా వెళ్లిదంటూ చిందులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి బాగోతాలు, వాస్తవాలు వెలుగులోకి రావడంపై అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. గురువారం ఒంగోలులో జరిగిన మెప్మా ఎండీ తేజ్ భరత్ సమీక్ష సమావేశంలో పీడీ శ్రీహరి, ఒంగోలు సీఎంఎం సంతోష్‌లపై ఎంతః సీరియస్ కావడం, జరిగిన అంశాలపై ఒంగోలు సీఎంఎంకి అక్షింతలు వేయడంతో కలవరపడిన సీఎంఎం సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే అంశాలపై ఆరా తీయడంతోపాటు, సమావేశంలో పాల్గొన్న అధికారులను బెదిరించినట్లు సమాచారం. ప్రత్యేకించి సమావేశంలో జరిగిన వాస్తవాలను ఆంధ్రజ్యోతిలోనే ప్రచురించడం పట్ల పలువురిని బెదిరించడంతోపాటు, అసభ్య పదజాలంతో దూషించడం ఇప్పుడు మెప్మాలో చర్చనీయాంశమైంది. వార్త రాసిన వారికి, రాయించిన వారికి ఎక్కడ ఎలా? పెట్టాలో మాకు తెలుసు అంటూ నేరుగా బెదిరించడం పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మెప్మాలో జరుగుతున్న బోగస్ గ్రూప్‌ల వ్యవహారం, అధికారుల వసూళ్ల పర్వం, ఇతరత్రా అంశాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంపై అధికారులు మల్లాగుల్లాలు పడటంతోపాటు, సమాచారం బయటకు ఎలా వెళుతోంది? అనే అంశంపై పలువురు ఆర్పీలను, కార్యాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం.

స్కూటీని ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కళ్లగుంట శ్రీను

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కనుమళ్లలో జాతీయ రహదారిపై రన్ వే వద్ద అదే గ్రామానికి చెందిన కళ్లగుంట శ్రీను స్కూటీపై రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కావలి వైపు నుంచి ఒంగోలు వెళుతున్న లారీ అదుపుతప్పి శనివారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ లారీ ముందు టైరు కింద పడింది. దీంతో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలకు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. బాధితుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో స్వగ్రామం కనమళ్లకు వచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం సింగరాయకొండకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సింగరాయకొండ ఎస్సై వి.మహేంద్ర సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



నారుమడులను పరిశీలిస్తున్న అధికారులు

నారుమడుల పరిశీలన

● నర్సరీ యజమానులకు సూచనలు

కొండపి,నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న నారుమడులను పొగాకు బోర్డు నర్సరీస్ మానిటరింగ్ టీం లీడర్ సత్యశ్రీనివాస్ శనివారం పరిశీలించారు. మండలంలోని పెరిదేపి, జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామాల్లో దెబ్బతిన్న నారుమడులను పరిశీలించి యజమానులకు తగిన సూచనలు చేశారు. నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా యజమానుల నుంచి పొగాకు బోర్డు ఇచ్చిన రశీదులు పొందాలని రైతులకు సూచించారు. నర్సరీలు పెట్టిన యజమానులు బోర్డు వద్ద నుంచి రశీదు పుస్తకాలు తీసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన నారును వేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ఆయన వెంట బోర్డు నర్సరీస్ మానటరింగ్ టీం సభ్యుడు మోతీలాల్, పెరిదేపి క్షేత్ర సహాయకురాలు గాయత్రి, కామేపల్లి క్షేత్ర సహాయకుడు మనీష్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్

● నగరంలో 8 బృందాలతో తనిఖీలు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శనివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎనిమిది ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదన చేస్తున్న 13మంది మైనర్లు, 33మంది రహదారి నిబంధనలు అతిక్రమించినవారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ మైనర్లు వాహనచోదన చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవల్సి ఉంటుందని హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదంటూ కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శ్రీనివాసరావు శనివారం ఒంగోలులో ఎస్పీ వి.హర్షవర్ధనరాజును కలిసారు. శ్రీనివాసరావుకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావు గతంలో పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

చదువుకున్న స్కూల్‌ను మరువొద్దు

● మంత్రి స్వామి

● ముప్పవరం స్కూల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడు చదివిన స్కూళ్లను మరువొద్దని, విద్యాబుద్ధులు అందించిన స్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం దాతలు అందించాలని సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ముప్పవరం జడ్పీస్కూల్‌కు పూర్వ విద్యార్థులు దాదాపు 10 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పలు అభివృద్ధి పనులను స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సారథ్యంలో చేపట్టిందన్నారు. ఇదే సమయంలో స్కూళ్ల పూర్వ విద్యార్థులు కూడా తాము చదువుకున్న స్కూళ్ల పరిస్థితిని గమనిస్తుండాలని, ప్రజలు కూడా ప్రభుత్వ స్కూళ్ల పనితీరులో, వసతుల కల్పనలో భాగస్వాములు అవ్వడం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు మరింత బలోపేతం అవుతాయని, ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. జడ్పీస్కూల్‌లో 5 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు నిర్మించిన పెరిదేపి గ్రామానికి చెందిన ముప్పరాజు శ్రీనివాసరావును, స్కూల్ ముఖద్వారం, ప్రహరీగోడ, మొక్కలు ప్లాంటేషన్‌కు మూడు లక్షలు రూపాయలు వెచ్చించిన మిట్టపాలెం గ్రామ పూర్వ విద్యార్థి కొల్లూరి శ్రీహరిరావును, మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మిషనరీకి లక్షన్నర రూపాయలు అందించిన తా ళ్లూరి రమాకుమారిని, వాటర్ ప్లాంట్‌కు, షెడ్డు నిర్మాణానికి లక్ష రూపాయలు ఇచ్చిన ప్రస్తుత స్కూల్ హెచ్‌ఎం బడే కోటిరెడ్డిని, భవిష్యత్ అవసరాలకోసం స్కూల్‌కు లక్షా యాభైవేలు అందించిన చిన్నం లక్ష్మీనర్సు కుటుంబాన్ని మంత్రి స్వామి ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా ఇక నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు పెరుగును అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కార్యక్రమంలో దాతలతోపాటు కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణ స్వామి, టీడీపీ నాయకుడు నరసారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎక్కిరాల భరద్వాజ విగ్రహ ప్రతిష్ఠ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 10వ తేదీన ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిరంలో జరుగుతుందని షిరిడి సాయి కల్చరల్ మిషన్, శ్రీభరద్వాజ్ విగ్రహ ప్రతిష్ఠ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం సాయిబాబా, సాయి మాస్టర్ విగ్రహాల నగరోత్సవం ఉంటుందన్నారు. ఇక 10వ తేదీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సాయి మాస్టర్ బృందావనంలో ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సమావేశంలో మందిర కమిటీ అధ్యక్షురాలు మల్లాది సుబ్బలక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, కార్యదర్శి మేడ జయరాం, ఉప కార్యదర్శి రుద్రవరపు సాయిబాబు, కోశాధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు గోపాలరావు, అంజయ్య, విజయ్ కుమార్, చంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, సాయి రాజు, సుధారాణి, ప్రమీలాదేవి, వాసు ఆచారి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళిత, బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత, బహుజనులు అలంకారప్రాయమైన పదవుల కోసం కాకుండా నిర్ణయం చేయగలిగే అధికారం కోసం ఉద్యమించాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తడ నుంచి తుని వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రికి నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్‌కాలనీలో నిర్మించిన ఐక్యతా స్థూపాన్ని ఆయన విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం చదలవాడ పశుక్షేత్రం ఎదురుగా ఉన్న వెంచర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికారం దళిత, బడుగు, బలహీన వర్గాలు, మహిళల చేతుల్లో లేదన్నారు.

పేదలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్న పాలకులు తదనంతరం వారికి నమ్మకద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నోచోట్ల దళితులపై దాడులు జరిగినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. సభలో పలువురు నాయకులు విజయ్‌కుమార్‌కు జ్ఞాపికలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయశ్రీ, దమ్ము చెన్నకేశవులు, ఎస్.కృష్ణాఫర్, ఇసుక గోపి, కేజీ.శ్రీనివాస్, వంతు శ్యాంప్రకాశ్, లేళ్లపల్లి చంద్ర, మాచవరపు జూలియన్, మల్లెల బుల్లెబ్బాయి, చిడితోటి శోభన్‌బాబు, చిడితోటి సుధీర్‌బాబు, మధన్‌మిశ్రా, హెప్సీబా, బుద్ధ కోటి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప అఖండ పడిభజన



చీమకుర్తిలో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం

చీమకుర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని రామనగర్‌లో శనివారం రాత్రి అయ్యప్పస్వామి అఖండ పడిభజనను అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పోతురాజు శ్రీనుస్వామి తన ఇంటి ఆవరణలో భారీ సెట్టింగ్‌తో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శివ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో దీక్షదారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటినుంచి హరిహరక్షేత్రంలో అన్నసంతర్పణ

చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో సర్వదీక్షాధారులకు ఆదివారం నుంచి అన్నదానాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కలశ ప్రతిష్ఠ, విశేషపూజలు, పడిభజన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



క్రీడల్లో రింగ్ విసురుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ క్రికెట్ క్రీడాకారిణి శ్రీచరణి స్ఫూర్తితో అందరు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానంలో 42వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి జూనియర్స్ బాలబాలికలు సుమారు 200 మంది హాజరయ్యారు. శని, ఆదివారం రెండురోజులు జరిగే ఈ పోటీలు స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదూర ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిన చిన్నారులను అభినందించారు. గత ప్రభుత్వం క్రీడలకు సంబంధించి నిలిపివేసిన ఇన్‌సెంటివ్‌లు కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు వివరించారు. క్రీడలను ప్రారంభించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో శాప్ డైరక్టర్ పేరం రవీంద్రనాథ్, సెక్రటరీ ఎన్‌వీ సత్యనారాయణ, కోశాధికారి కుంచే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.అలేఖ్య, జిల్లా కోశాధికారి కొల్లయ్య, దీప్తి, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

● మరో ఇద్దరు సురక్షితం

● ఇడుపులపాడులో ఘటన

● ఈత సరదాతో చెరువులో దిగిన ముగ్గురు యువకులు



సుమంత్ (ఫైల్)

ఇంకొల్లు, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : ఈత సరదాలో చెరువులో దిగిన ముగ్గురులో ఇద్దరు సురక్షితంగా బయటపడి ఒక యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇడుపులపాడులో శనివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన బండారు సుమంత్(16),కొర్నేలు,అనీల్ ఈతకు ఎస్సీకాలనీ సమీపంలోని చెరువులో దిగారు.బండారు సుమంత్ చెరువులో నుండి బయటకు రాలేక పోయారు.మిగిలిన ఇద్దరు బయటకు చేరుకొని విషయం స్థానికులకు తెలిపారు.సుమంత్ ఆచూకి తెలియకపోవడంతో సిఐ వై.వి రమణయ్య,ఎస్సై సురేష్,తహశీల్ధారు శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చీరాల బోట్‌ను తెప్పించి చెరువులో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమంత్ తండ్రి భూషయ్య పరుగు జిల్లాలో బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సుమంత్ చీరాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాత్రి 9 గంటల వరకు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సుమంత్ మృతదేహం ఆచూకి తెలియలేదు. చెరువు చుట్టూ సమీప బంధుమిత్రులు సుమంత్ మృతదేహం కోసం వేచి చూస్తున్నారు. అధికారులు సుమంత్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మండలంలోని కొణికి గ్రామ పొలాల సమీపంలోని వాగు వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు శనివారం పోలీసులు గుర్తించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉంది. స్త్రీ లేదా పురుషుడా అనేది కూడా గుర్తించలేని విధంగా మృతదేహం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల నీటి ఉధృతికి కొట్టుకు వచ్చి ఉండవచ్చునని భావిస్తున్నారు. స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వంకం వీరాంజనేయులు(65) అను రైతు శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు వీరాంజనేయులు తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు గ్రామంలో మరి కొంత పొలాన్ని కౌలకు తీసుకుని సాగు చేశాడు. పొలంలో నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు రోజురోజుకు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందును తెచ్చుకొని ఇంట్లోనే తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.



షూటింగ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా షూటింగ్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా బాల, బాలికల షూటింగ్ పోటీలు శనివారం ఒంగోలులోని నెక్స్‌జెన్ స్కూలులో ఉత్సాహంగా సాగాయి. ఈ మేరకు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేందుకు పోటీ పడ్డారు. రెండు రోజుల నుంచి ఎంపిక పోటీలు జరుగుతుండగా, ఆదివారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్కా వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, వ్యాయామోపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో రామాంజనేయులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ నేత బొమ్మినేని రామాంజనేయులు కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో అండర్-14 విభాగంలో ఎండ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారిని రామాంజనేయులు అభినందించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. హెచ్‌ఎం శేషిరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకొరతో అయోమయం

(5వపేజీ తరువాయి)

ప్రకారం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలు ఇచ్చిన వాటా ప్రకారం నీళ్లు వాడుకోవాలి. ప్రతి నీటి చుక్కనూ లెక్క కట్టి ఆయా రాష్ట్రాల లెక్కల్లో వేస్తారు. ఇప్పుడు కృష్ణా నదిలో నీరు సముద్రంలోకి వదులుతున్నందున ఈ సమయంలో కాల్వలకు వదిలిన నీరు వాటాల పరిధిలోకి తీసుకోదు. ఇరిగేషన్ అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాగర్ కుడికాలువకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తే చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందే అవకాశం ఉంటుంది. ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ) పరిధిలోని చివరి భూముల్లో ఇంకా వరినాట్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం ఓబీసీకి అతి తక్కువగా నీరు విడుదల అవుతుండటంతో మేజర్లు, మైనర్లకు నీరందక వరినాట్లు సాగటం లేదు. గతంలో వరినాట్లు వేసిన లేత పైర్లకు నీరు పెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఏ కారణం చేతనో అధికారులు ఉన్న అవకాశాన్ని సక్రమంగా వినియోగించలేకపోతున్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న సాగునీటి వివరాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెంచుతాం

సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెంచాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ప్రస్తుతం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం బార్డర్) 2,269 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు తక్కువగా నీరందుతున్న విషయాన్ని గమనించి ఈ నీటి పరిమాణాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- విజయలక్ష్మీ, ఎన్ఎస్‌పీ ఈఈ, దర్శి

తొలగిన అవాంతరాలు

(5వపేజీ తరువాయి)

పేరుకుపోవడంతో సాఫీగా నీరు పారక పలుచోట్ల పొంగిపొర్లింది. సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే కందుల యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన ఇరిగేషన్ అధికారులు ఓఅండ్ఎం నిధులు రూ.15లక్షలతో పనులు ఐదు రోజుల్లో పూర్తి చేశారు. ప్రధానంగా గండ్లు పూడ్చడంతోపాటు లీకులను సరిచేయడం, కాలువలో గుర్రపుడెక్క తొలగింపు, బ్రిడ్జిల సమీపాల్లో పేరుకపోయిన చెత్తాచెదారాలను ఎక్స్‌కవేటర్‌తో తీసివేశారు. దీంతో ప్రస్తుతం నీరు సాఫీగా చెరువుకు చేరుతోంది. వారంరోజుల్లోపు చెరువు పూర్తిగా నిండనుందని మార్కాపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి తెలిపారు. చెరువు నిండి అలుగు పారితే బయటకు వచ్చే నీటిని బోడపాడు సమీపంలోగల కొత్తచెరువుకు తరలించేందుకు ఉన్న కాలువకు కూడా మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో నిర్లక్ష్యం

(5వపేజీ తరువాయి)

చేశారు. అలా జిల్లాలో తురకపాలెం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయగా మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అన్నిచోట్లా తప్పులే

జిల్లాలో 729 గ్రామపంచాయతీలు ఉండగా అన్నిచోట్లా ఫోన్, ఆధార్ నెంబర్లు తప్పుల తడకగానే నమోదు చేసినట్లు సమాచారం. దీంతో ఆ నెంబర్లను మార్చేందుకు మరోసారి అవకాశం కల్పించారు. ప్రతి ఇంటి యజమాని ఫోన్ నెంబర్‌తో పాటు ఆధార్‌ను నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా పంచాయతీ అధికారులు కూడా ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించారు. అందుకు సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల్లో డేటా సేకరణలో జరిగిన తప్పిదాలను వెంటనే సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సర్క్యులర్‌ను జారీ చేశారు. ఇదేవిధంగా తప్పిదాలు జరిగితే సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో కూడా నిరంతరంగా ఆయా పంచాయతీల నుంచి వచ్చిన డేటాను పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది.



కొండపి మండలం ఇలవర గ్రామ అనారోగ్య బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

పేదల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- 77 మందికి రూ. 53.71 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

టంగుటూరు (కొండపి), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం 77మంది లబ్ధిదారులకు రూ. 53.71 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ప్రజా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నియోజకవర్గంలోని 1,002 మందికి 8.59 కోట్ల రూపాయలు మంజూరు చేశారని మంత్రి అన్నారు. ప్రజా సంక్షేమం, పేదల ఆరోగ్యమే అజెండాగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఇందుకు నిదర్శనం అనారోగ్య బాధితులందరికీ సాయం అందించడమేనని స్వామి అన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి స్వామి అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు ఈసందర్భంగా మంత్రి స్వామికి, సీఎం చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఐటీయూ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు ధ్వజం

దర్శి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ధ్వజమెత్తారు. దర్శిలో శనివారం సీఐటీయూ జిల్లా మహాసభల ప్రారంభసందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను రద్దు చేసి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తిలోదకాలు ఇచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా అమలు గురించి పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు, కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్, అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు విసత్యవతి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కల్పన, జిల్లా కార్యదర్శి టి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సరి'హద్దు'తో సతమతం

ఒక గ్రామం
రెండు జిల్లాల పరిధిలో ..
రహదారికి ఓ వైపు ప్రకాశం జిల్లా
రెండో వైపు పల్నాడు
అవే గాజులపాలెం.., గార్లదిన్నె
అభివృద్ధికి అడ్డంకిగా పరిధులు
కొత్త జిల్లా ఏర్పాటులోనైనా సమస్యను
పరిష్కరించాలని ప్రజల వినతి

ఆ గ్రామం రెండు జిల్లాల పరిధిలో ఉంది. ఇద్దరేసి ప్రజా ప్రతినిధులు. వీధి ఒకటే కానీ కుడివైపు ప్రకాశం .. ఎడమ వైపు పల్నాడు జిల్లా పరిధి. ఎన్నో ఏళ్లుగా ఇలా కొనసాగుతున్న ఇటువంటి సరిహద్దు కారణంగా పాలనాపరంగా ఇబ్బందులు, అధికారిక కార్యక్రమాల్లో సమస్యలు వెరసి అభివృద్ధిలో కూడా రెంటికీ చెడ్డ రేవడిగానే మిగిలిపోయింది. ఇప్పుడు తాజాగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కాబోతున్న తరుణంలో ఇటువంటి సరిహద్దు సమస్యతో ఉన్న గ్రామ సమస్యను సరిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.





ఈ వీధికి ఒకవైపు పల్నాడు, మరోవైపు ప్రకాశం పరిధి (ఇన్‌సెట్లో) ప్రకాశం పిల్లల పాఠశాల భవనం



గార్లదిన్నె పేరుతో ఉన్న పల్నాడు పరిధిలోని పాఠశాల

త్రిపురాంతకం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల పల్లె అది. పుల్లలచెరువు మండలం శివారులో ఉన్న ఈ గ్రామం పేరు గాజులపాలెం. మర్రివేముల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ చిన్న గ్రామాన్ని ప్రధానరోడ్డు రెండు భాగాలుగా చేసింది. రోడ్డుకు ఒకవైపు ఉన్న ఇళ్లు గాజులపాలెం అని ఇది ప్రకాశం జిల్లా పరిధిలోకి వస్తే, రెండోవైపు ఇళ్లన్నీ గార్లదిన్నె అనే పేరుతో పల్నాడు జిల్లా పరిధిలో ఉన్నది. ఒకవైపు పుల్లలచెరువు మండలం అయితే మరోవైపు పల్నాడు పరిధిలో ఉండి పక్కనే ఉన్న రావులాపురం గ్రామ పంచాయతీ పరిధిలోకి వెళ్లింది. రెండు వైపులా ఉన్న ఇళ్లు కూడా దాదాపు 250 మాత్రమే. పల్నాడు పరిధిలోని ఓటర్లు దాదాపు 150 మంది ఉంటే ప్రకాశం పరిధిలో ఓటర్లు దాదాపు 250 మంది ఉన్నారు. ఇంత చిన్న గ్రామంలో ఏ కార్యక్రమమైనా ఎవరి పరిధిలో వారే ఇద్దరేసి ప్రజా ప్రతినిధులు హాజరవ్వాల్సిందే. కొద్దిమందిగా ఉన్న పిల్లల కోసం కూడా రెండు వైపులా రెండు ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఇలా అన్నీ సరిహద్దు సమస్యతో విడిపోయినట్టు కనిపించే వాతావరణం ఆ గ్రామాన్ని ఎన్నో ఏళ్లుగా పీడిస్తోంది. ఇక రహదారుల సమస్య కూడా అంతే. పల్నాడు పరిధి వరకు రోడ్డు దారుణంగా ఉంటే ప్రకాశం పరిధి వరకు ఇక్కడి పాలకులు రోడ్డేయాల్సిన పరిస్థితి. ఇలా అన్నింటికీ అవస్థలు పడే ఈ గ్రామం రెండింటికీ చెడ్డ రేవడిలా అభివృద్ధిలో కూడా నత్తనడకన అవస్థలు పడుతూనే ఉంది. ఇప్పుడు కొత్త జిల్లాల ఏర్పాటు అంశం తెరమీదకు రావడం, అదీకూడా మార్కాపురం జిల్లా అవుతున్న నేపథ్యంలో పాలకులు, అధికారులు ఇటువంటి హద్దు సమస్యతో విడగొట్టిన గ్రామ సమస్య పరిష్కరించి ఇటోఅటో ఒక దరికి చేర్చాలని ప్రజలు కోరుతూ ప్రజా ప్రతినిధుల వద్దకు వినతిపత్రాలు తీసుకొస్తున్నారు. ఈ విషయాన్ని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా ఈ గ్రామ హద్దు సమస్యను ఇటువంటి సందర్భంలో సరిచేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని జిల్లా ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్న మంత్రుల ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మొత్తానికి గాజులపాలెం, గార్లదిన్నె ఒకటయ్యే అవకాశం ఇదే కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

'వెలిగొండ'కు నిధులు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుపూర్తిస్థాయి నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకపోవడానికి కారణం జగన్‌ప్రభుత్వం అని పేర్కొనడం ఏమిటని ప్రశ్నించారు. నిమ్మల రామానాయుడు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీపీఐ బృందం కలిసి బడ్జెట్‌లో రూ. 4వేల కోట్లు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కోరామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 బడ్జెట్‌లో రూ. 300 కోట్లు, 2025 బడ్జెట్‌లో రూ. 35 కోట్లు కేటాయించిందని, ఆ ప్రకారమైతే చంద్రబాబు నాయుడు మరో 30 పుట్టిన రోజులు చేసుకున్నా వెలిగొండ పూర్తి కాదని ఆరోపించారు.

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని ఈశ్వరయ్య ఆక్షేపించారు. వైసీపీ ప్రభుత్వకాలంలో వైద్యవిద్యలో 50 శాతం సీట్లు ప్రైవేటుకు కేటాయిస్తే కూటమి ప్రభుత్వం వంద సీట్లను ప్రైవేటుకు అప్పగించడం దుర్మార్గంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఇన్‌చార్జి జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సహాయ కార్యదర్శి వెంకట్రావు, నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు ఉన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం

సీఎండీ పుల్లారెడ్డి

విద్యుత్ సబ్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

పెద్దదోర్నాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డి తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆ శాఖ సీఎండీ పుల్లారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యుత్ సరఫరా గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో కొందరు రైతులు రాత్రివేళ వ్యవసాయ మోటార్లకు కరెంట్ సరఫరా ఇస్తున్నారని, ఎందుకని సంబంధిత అధికారులను అడిగితే లోవోల్టేజీ ఉందని చెప్తున్నారని సీఎండీ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ శియా నాయక్, డీఈ శ్రీనివాసరావు, ఏఈ భీమానాయక్, టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, చంటి, అంబటి వీరారెడ్డి పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

సింగపూర్ పర్యటనకు నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులు



సింగపూర్ వెళ్తున్న ఉత్తమ ఉపాధ్యాయులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యావిధానంలో నూతన సంస్కరణలు తెచ్చేందుకు ఈనెల 27వతేదీ నుంచి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్‌లో పర్యటించనున్నారు. అక్కడి విద్యా విధానాన్ని పరిశీలించనున్నారు. మంత్రి నారా లోకేష్‌తో పాటు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది వెళ్లనున్నారు. అందులో మన జిల్లా నుంచి నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్(తర్లుబాడు),ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయురాలు బి. సరోజిని(మొగళ్లూరు), సోషల్ ఉపాధ్యాయురాలు జీ. ఈశ్వరమ్మ(పీసీపల్లి), హిందీ ఉపాధ్యాయుడు గుంటగాని భాస్కరరావు(తంగెళ్ల)లు ఉన్నారు.

ఈనెల 27వతేదీన ఈ నలుగురు ఉపాధ్యాయులు సింగపూర్ వెళ్లనున్నారు. అందుకు సంబంధించిన వీసాలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సింగపూర్‌లో ప్రముఖ విద్యాసంస్థలను సందర్శించి అక్కడి విద్యా విధానంపై అధ్యయనం చేయనున్నారు.

కమనీయం చెన్నకేశవ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామికి శాంతి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, నంద్యాల రంగాచార్యులు, సాయికుమార్ ఆచారులు, స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మందిరం మండపంలో నిత్యపూజ లందుకునే శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై వేంచేపు చేశారు. పట్టువస్త్రాలు, వివిధ ఆభరణాలు, పుష్పమాలలో అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. రాయలసీమ నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో గొలమాను శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి, భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

వైభవంగా రంగనాయక స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో రంగనాయకస్వామి

రాచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం స్వామివారి మాస కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి అన్నవరం పాండురంగాచార్యుల బృందం స్వామివారి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని చూసి తరించారు. శనివారం ప్రత్యేక పూజలు సందర్భంగా ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్, మార్కాపురం కోర్టు న్యాయాధికారి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

రేపు 'మీ కోసం' రద్దు

- 11న సీఎం చంద్రబాబు రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న జిల్లాకు వస్తుండటంతో సోమవారం జరగాల్సిన మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పీ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి ఎవరూ మీ కోసంలో అర్జీలు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ రాజాబాబు కోరారు.

జూడోలో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్



ఎస్పీ వి.హర్షవర్ధనరాజుతో కాంస్య పతక విజేత రత్నబాబు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పోలీసు జూడో క్లస్టర్ పోటీల్లో కానిస్టేబుల్ డీఏన్‌బీ రత్నబాబు కాంస్య పతకం సాధించి రాష్ట్ర పోలీసు శాఖకు గుర్తింపు తెచ్చారని ఎస్పీ వి.హర్షవర్ధన రాజు కొనియాడారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించారు. ప్రస్తుతం పుల్లల చెరువు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రత్నబాబు అలియాస్ గోపి గత నెల 8 నుంచి 16 వరకు శ్రీనగర్‌లో 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ పోటీల్లో పెన్‌చెక్ సిలాట్ 80-85 కిలోల విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించారు.



కొండ చిలువను పట్టుకున్న స్నేక్‌క్యాచర్

కొండచిలువ కలకలం

త్రిపురాంతకం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడపి గ్రామంలో శనివారం భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామంలోని చిన్నగాలెయ్య అనే వ్యక్తికి చెందిన పశువుల దొడ్డిలో కొండ చిలువను చూసిన ప్రజలు భయాందోళన చెంది స్నేక్‌క్యాచర్ మల్లికార్జునకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన మల్లికార్జున 10 అడుగులు ఉన్న కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలివేశారు.

యువ దర్శకుడికి అంతర్జాతీయ గుర్తింపు



తేజ కల్లూరి

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన యువ దర్శకుడు తేజ కల్లూరికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆయన రూపొందించిన సామాజిక షార్ట్ ఫిల్మ్ నవోదయం గోవాలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ కాంపిటేషన్‌కు అధికారికంగా ఎంపికైంది. ఫిల్మ్ ఫ్రీ వే ప్లాట్‌ఫారం ద్వారా జరిగిన ఎంపికలో తేజ దర్శకత్వం వహించిన నవోదయం షార్ట్ ఫిల్మ్ ఎంపిక సమయంలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందింది. నవోదయం షార్ట్ ఫిల్మ్‌లో నేటి రైతుల పరిస్థితిని, భూమి-మనిషి మధ్య ఉన్న మమకారం, తల్లీకొడుకు అనుబంధాన్ని హృదయాన్ని తాకేలా చూపిస్తుంది. కొత్త వ్యవసాయ ఆవిష్కరణలపై కూడా చర్చిస్తూ రైతు జీవితంలోని కష్టాలు, ఆశలను మానవీయంగా ప్రతిబింబించేలా దర్శకుడు తేజ కల్లూరి ఈ కథను తెరకెక్కించారు. సామాజిక అవగాహన కల్పించే అంశాన్ని హృదయాన్ని తాకే విధంగా ఆవిష్కరించినందుకు తేజని అభినందించారు.

పరకామణి కేసులో చర్యలు
పీడీసీలో పనిచేస్తున్న సీఐ వీఆర్‌కు..

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరకామణి కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసిన ముగ్గురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారు. అందుకు సంబంధించి ప్రస్తుతం ఒంగోలు పోలీసు శిక్షణ కళాశాలలో సీఐగా పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని కర్నూల్ రేంజ్ వీఆర్‌కు పంపించారు. అప్పట్లో జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతిలో పనిచేశారు. ప్రస్తుతం పరకామణి కేసులో కీలకపరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిలో భాగంగా తిరుపతి సీఐడీ విభాగంలో సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్, తిరుమల టూటౌన్ ఎస్ఐ పనిచేస్తున్న లక్ష్మారెడ్డి, ఒంగోలు పీడీసీలో పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డిలను వీఆర్‌కు పంపించారు.

బండ్లమూడి బాధితులకు న్యాయం చేయాలి



బాధితుడితో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బండ్లమూడి గ్రామంలో ఎస్సీలపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంతోపాటు కఠినంగా శిక్షించాలని, అలాగే బాధితులకు న్యాయం చేయాలని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దళితులపై దాడులు దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల తనిఖీ

సంతనూతలపాడు, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్ఐ వి.అజయ్‌బాబు శనివారం సంతనూతలపాడులో ప్రైవేట్ కళాశాలలు, స్కూల్ బస్సులను తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం పలు గ్రామాల శివార్లలో మందుబాబులపై పోలీసు సిబ్బంది దాడులు చేశారు. తాగిపడేసిన మద్యం గ్లాసులను, బాటిళ్లను ఏరివేసి దగ్ధం చేశారు. బయటప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం



ఈశ్వరయ్యను సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గుజ్జుల ఈశ్వరయ్యను ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు, ఇతర నాయకులు ఆయనను శాలువతో సత్కరించి బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



పతకాలను చూపుతున్న క్రీడాకారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలులో నిర్వహించిన క్రికెట్ పోటీలలో స్థానిక హైదరాబాద్ సెంట్రల్ స్కూలు జట్టు విజయం సాధించింది. ఈ పోటీలలో మొత్తం 12 టీములు పాల్గొనగా, హెచ్‌పీఎస్ మూడవ స్థానంలో విజయం సాధించింది. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ అనిరుధ్, వైస్ కెప్టెన్ బాల గంగాధర్‌లతో పాటు క్రీడాకారులను డైరెక్టర్ జగదీష్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా రంగభూమి సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముందుగా ప్రముఖ పౌరాణిక నటుడు డీవీ.సుబ్బారావు వర్ధంతి సందర్భంగా నెల్లూరు బస్టాండు దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి పలువురు కళాకారులు నివాళులర్పించారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటకంలోని అడవి సీను, వారణాసి సీను, కాటిసీనులను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పొదిలి బాలగురవయ్య, జీవీ.సుబ్బారావు, శిరీష, ద్వారం లక్ష్మారెడ్డి, ద్వారం శ్రీనివాసరెడ్డి, పిచ్చయ్యపంతులు, గోవిందు, అంగలకుర్తి ప్రసాదు, ఎం.శాంతారావు, కట్టా వెంకటేశ్వర్లు తదితరులు నటించారు. సంఘ అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధానకార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, సభ్యులు మాకా అంజనేయులు, ఏల్చూరి అనంతలక్ష్మి, రంగారావు, బేబి, కొప్పోలు వెంకటేశ్వర్లు, శాంతారావు, సుబ్బయ్య, ఎస్కే బాబు తదితరులు పర్యవేక్షించారు.

మూలగుంటపాడులో భూసమస్యల పరిష్కారం

● మంత్రి స్వామికి గ్రామస్థుల కృతజ్ఞతలు



మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీలోని 108/3 సర్వేనంబరులో గత ప్రభుత్వం రీసర్వే అసమగ్రంగా చేసిన కారణంగా భూముల రిజిస్ట్రేషన్ ఇబ్బందికరంగా మారింది. ఈ సర్వే నంబర్‌లో అధిక విస్తీర్ణం ఉంది. గడచిన ఏడాదికాలంగా ఈసర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో క్రయవిక్రయాలు ఆగిపోయి వందలాది మంది ఇబ్బందులు పడ్డారు. అయితే సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి గ్రామస్థులు పలు దఫాలు తీసుకువెళ్లారు. ఈ సమస్యపై ఇరువురూ రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది. రిజిస్ట్రేషన్‌ల నిషేధాన్ని తొలగిస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, నాయకులు చిగురుపాటి గిరి, సన్నెబోయిన మల్లికార్జున, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం అఖిల భారత యువజన సమాఖ్య ఆఫీసు బేరర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కరుణానిధి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఆర్భాటపు ప్రచారాలు చేసి తరువాత విస్మరించారని మండిపడ్డారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమని, లేనిపక్షంలో ఐదువేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్, సహాయ కార్యదర్శి సబ్బు, రామాంజి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు విజయవంతంపై కృతజ్ఞతలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఇటీవల జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కృతజ్ఞతలు తెలిపారు. మహాసభల ఆహ్వాన సంఘం ముగింపుసభ శనివారం స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో జిల్లాకార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ మహాసభలు కనీవిని ఎరుగని రీతిలో విజయవంతమయ్యాయని తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులు సీపీఐ వంద సంవత్సరాల వేడుకలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు వంద మంది కళాకారులతో, వంద పాటలతో, 100 గళాలతో, 100 కళారూపాలతో ప్రదర్శనలు నిర్వహించారన్నారు. వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, రచయిత జయరాజ్, నల్లూరి వెంకటేశ్వర్లు వంటి ప్రముఖులు, ప్రజలు హాజరై విజయవంతం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జంగాల అజయ్‌కుమార్, ఆర్.వెంకట్రావుతో పాటు జిల్లా నలుమూలల నుంచి భారీగా శ్రేణులు తరలివచ్చారు. కాగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ లేక ప్రజల వెతలు

మద్దిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నందిపాడులో త్రీఫేజ్ కరెంటు లేక మోటార్లు పనిచేయక తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులకు, గ్రామ హెల్పర్లకు చెప్పినా వారు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో తాగునీరు తెచ్చుకోవాలంటే ప్రజలు అరకిలోమీటర్ పోవాల్సి వస్తోంది. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని, అదేవిధంగా లైట్లు, గృహోపకరణాలు కూడా పనిచేయటం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇరువురి అరెస్టు

● వన్‌టౌన్ సీఐ నాగరాజు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1250 గ్రాముల గంజాయి, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నామని ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం స్థానిక సీతారామపురం కొండమీద పశ్చిమబెంగాల్‌కు చెందిన సాహుద్దీన్ సర్దార్, అలిమొండాల్ గంజాయి తీసుకువచ్చి విక్రయించేందుకు రాగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో నలుగురు కొనగోలు చేసేందుకు వచ్చారు. దీంతో సీఐ నాగరాజు తన సిబ్బందితో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

దొడ్డవరంలో విజృంభించిన గున్యా

● ఇబ్బందిపడుతున్న బాధితులు

మద్దిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామంలో గున్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక బీసీ కాలనీ, అరుంధతి నగర్‌లో పలువురు జ్వరంతో అల్లాడుతున్నారు. కొంతమంది రోగులు ఒంగోలు లోని వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు ఇంటి వద్ద ఉండి ఆర్ఎంపీలతో చికిత్స పొందుతున్నారు. అలాగే వారం రోజుల నుంచి విష జ్వరాలతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామంలోకి వైద్య సిబ్బంది వచ్చిన పాపాన పోలేదు. గ్రామలో చిన్నారులు, వృద్ధులు జ్వరం ఒళ్లనొప్పులతో బాధపడుతున్నారు. కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ఉచిత వైద్య శిబి రం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైనంపాడులో ఫాగింగ్

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మైనంపాడులో శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అనంతరం కాలువల్లో ఎబెట్, బ్లీచింగ్ చల్లించారు. ఇళ్ల వద్ద ఖాళీటైర్లలోను, తాగిపడేసిన కొబ్బరిబొండాల్లో నీటినిల్వలను ఉంచొద్దని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, సర్పంచ్ దాట్ల రమణమ్మ పాల్గొన్నారు.

భక్త కనకదాసుకు ఎస్పీ ఘన నివాళి

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు బోధనలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో కనకదాసు జయంతి సంధ్భంగా ఆయన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. 1509లో కర్ణాటకలో జన్మించిన కనకదాసు కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా గుర్తింపు పొందారని ఎస్పీ తెలిపారు. సమాజంలో అసమానతనలు తొలిగించేందుకు చేసిన కృషి ఎనలేనిదని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, యు.సుధాకర్, జగదీష్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంజనీరింగ్, జీవననైపుణ్యంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టీయూకే మాజీ వీసీ కేవీఎస్‌జీ.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు జీవన నైపుణ్యంతో పాటు క్రియేటివ్, కమ్యూనికేషన్, టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యమన్నారు. మార్కెట్‌లో మంచి ఉద్యోగ సాధనకు వివిధ నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవశ్యకత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా తానురచించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, కె.రూప ఆక్సేష్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్కసుతోనే 'ఆదిమూలపు' పిచ్చిమాటలు

● ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యనమద్ది

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మళ్లీ ఓడిపోతాననే భయం, అక్కసుతోనే మంత్రి స్వామిపై మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు ఆదిమూలపు సురేష్ పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు యనమద్ది వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం సాయంత్రం ఆయన కొండపిలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నియోజకవర్గాలు మారిన సురేష్ భవిష్యత్‌లో ఇక్కడ ఉన్నా గెలవలేమన్న భావనకు వచ్చి మంత్రిపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. జగన్ అవినీతిలో అంటకాగి ఈడీ, సీబీఐ కేసుల్లో ఉన్న సురేష్ మంత్రి డబ్బులు పోగుచేసుకుంటున్నాడనడం సిగ్గుచేటన్నారు. మూడు దఫాలుగా ప్రతి గ్రామం మంత్రి స్వామికి నియోజకవర్గంలో అండగా నిలిచిందని, 2019లో రాష్ట్రంలో ఎస్సీ స్థానంలో గెలిచింది స్వామి ఒక్కడేనని వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. తాజాగా జరిగిన కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా స్వామి సామాజిక న్యాయం పాటించారని, ఇదే ఆయన మనస్తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొండపి సర్పంచ్ కొమ్ము సుశీల, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గంటెనపల్లి మల్లికార్జున, ఎస్సీసెల్ నాయకులు ఈతముక్కల బ్రహ్మయ్య, అల్లడి కల్యాణ్, ఎదురు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు గండ్లు

- ఏళ్లుగా మరమ్మతులు కరువు
- బీళ్లుగా వందల ఎకరాల భూములు
- ఆయకట్టుదారుల ఆందోళన
- కోనపల్లె - పూసలపాడు పరిస్థితి అధ్వానం


సొరంగాల ద్వారా వాగుపాలవుతున్న నీరు


గండిపడిన పూసలపాడు చెరువు

బేస్తవారపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏళ్లతరబడి ఏర్పడిన గండ్లను పూడ్చలేదు. పంట కాలువలు, తూములు అధ్వానంగా ఉన్నాయి. జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపించడంతోపాటు మంజూరైన నిధులను సక్రమంగా చెరువులకు ఉపయోగించకపోవడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని కొన్ని చెరువులకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు కోనపల్లె చెరువులో నీరు పూర్తి స్థాయిలో చేరి అలుగు పారింది. దీంతో రైతులు ఆశతో ఎదురు చూశారు. ఇకనైనా తమ పొలాలు పంటలు పండుతాయని అంతలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. చెరువు నిండింది. మూడు రోజులకే చెరువులోని నీరు ఖాళీ అయ్యాయి. ఆ చెరువు కాంట్రాక్టర్లకు కల్పవృక్షంగా మారింది. చెరువు నిర్మించప్పటి నుంచి దాదాపు ఇప్పటికి రూ.4కోట్లకు పైగా ఖర్చు చేశారు. మరమ్మతులు చేయడం చెరువుకు మళ్లీ గండ్లు పడడం పరిపాటైంది. చెరువులో సొరంగాలు ఏర్పడి దిగువన ఉన్న వాగులోకి నీరు వెళ్తుంది. చెరువుకు కోట్ల రూపాయాలు ఖర్చు చేసిన నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. దీంతో దాని కింద ఉన్న వ్యవసాయ భూములు బీళ్లుగా మారాయి. పలువురు నిపుణులు పరిశీలించి అనేక రకాల పనులు ప్రయోగాత్మకంగా చేసినా ఫలితం దక్కలేదు. 500 ఎకరాల ఆయకట్టు నిరుపయోగంగా మారింది. శింగరపల్లె గ్రామానికి తూర్పువైపున నూతనంగా చెరువులు ఏర్పాటు చేస్తే వందల ఎకరాల్లో పంటలు సస్యశ్యామలంగా పండి, రైతుల పరిస్థితి మెరుగుపడుతుంది. ఈ విషయమై అధికారులు సర్వేలకు మాత్రమే పరిమితమయ్యారు. రూ.11కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కానీ ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకోలేదు. నిధులు మంజూరు కాలేదు. దీంతో వయ్యి ఎకరాల భూములు బీళ్లుగా మారాయి. పూసలపాడు గ్రామంలోని కోట్లు ఖర్చు చేసి రెండు దశాబ్దాల కిందట చెరువును నిర్మించారు. నేటికీ అది ఉపయోగంలోకి రాలేదు. చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో వరద వచ్చిన ప్రతిసారీ గండ్లు పడి నీరు వృథాగా పోతుంది. జేసీ అగ్రహారం చెరువుకు పూర్తిస్థాయిలో చెరువు కట్ట ఎత్తు పెంచాల్సి ఉండగా పెంచలేదు. అలాగే దప్పిలివారి కుంటకు సప్లై చానల్ కతువ నుంచి నీరు వచ్చే కాలువను అభివృద్ధి చేస్తే చెరువు కింది ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు కోరుతున్నారు. మోక్షగుండం కొత్తచెరువు, ఖాజీపురం హోసూరమ్మ చెరువుల పంట కాలువకు, తూములకు మరమ్మతులు చేయాల్సి ఉంది. జెన్నివారిపల్లె చెరువు మరమ్మతులు నోచుకోక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్లాపురం చెరువుకు మరమ్మతులు చేసినా నీరు లేక సుమారు 1500 ఎకరాలు సాగులోకి రాలేదు. జగ్గంబొట్ల కృష్ణాపురం ఉప్పువాగు నుంచి ఆయకట్టు కాలువను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. పిటికాయగుళ్ల చెరువుకు రూ.2కోట్లతో పనులు చేసినా ఫలితం సక్రమంగా లేదు. చెరువులో నేటికీ చిల్లకంప నిండి ఉంది.


ధ్వంసమైన ఏలూరు-సల్లూరు రోడ్డు

ప్రమాదకరంగా ఏలూరు ప్రధాన రహదారి

పొదిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు, సల్లూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఏలూరు, సల్లూరు, నల్లారెడ్డిపాలెం, మర్రిపూడి మండలంలోని లంకూరు గ్రామాలకు ఇదే ప్రధానదారి. ఈ రోడ్డుపై వందల సంఖ్యలో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. రోజూ వందల సంఖ్యలో టిప్పర్లు, లారీలు తిరుగుతుంటాయి. దీంతో రోడ్డు ఛిద్రమైంది. రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేసినా అధికారులు చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

నేడు కంభంలో కార్తీక వనభోజనాలు

కంభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణం చిన్న కంభం రోడ్డులో గుండికా నది ఒడ్డున శాలివాహనులచే నిర్మించిన శ్రీకాశ విశ్వనాథ కోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆదివారం కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కమిటీ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం కార్తీక వనభోజనాలకు ముందుగా ఆలయ ప్రాంగణంలో సామూహిక గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమాలు ఆలయ పూజారి ఆంజనేయ శర్మ నిర్వహిస్తారని తెలిపారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాలలోని భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పద్య పోటీలు

తర్లుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 9న ఎస్టీయూ ఆధ్వర్యంలో పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ జగన్‌బాబు, ఎస్కే నజీర్ అమ్మద్ తెలిపారు. ఈ పోటీలు తర్లుపాడులోని ఎమ్మార్సీ భవనం వద్ద నిర్వహిస్తున్నట్ల తెలిపారు. ప్రాథమికోన్నత శాల విద్యార్థులకు 50 పద్యాలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 100 పద్యాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.2016, ద్వితీయ బహుమతి రూ.1216, తృతీయ బహుమతి రూ.716 ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనవలసిన విద్యార్థులు ఎస్టీయూ అధ్యక, ప్రధాన కార్యదర్శులను సంప్రదించాలని వారు కోరారు.

డాక్టర్ మహబూబ్ వలీకి సన్మానం


డాక్టర్ మహబూబ్ వలీని సన్మానిస్తున్న మాజీ సైనికులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జై జవాన్ మాజీ సైనికుల సంక్షేమ భవనంలో శనివారం సివిల్ పబ్లిక్ సర్వీస్ సంస్థ రాష్ట్ర అధ్యకుడు డాక్టర్ షేక్ మహబూబ్ వలీనీ జైజవాన్ యూనియన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యుల అనుమతితో జైజవాన్ యూనియన్ కమిటీలో మహబూబ్ బాషాకు సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో జైజవాన్ యూనియన్ అధ్యక్షుడు హరినారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు రామకష్ణ, కార్యదర్శి శేషసాయి, చిన్నయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

సీఐ రాజేష్‌కుమార్


తాగి పడేసిన మద్యం సీసాలను ఏరివేయిస్తున్న సీఐ

పొదిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని సీఐ రాజేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పలుప్రదేశాల్లో బహిరంగంగా మందు తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు ప్రదేశాల్లో తాగి పడేసిన మందుబాటిళ్లు, వాటర్‌బాటిళ్ల తదితర వర్థాలను దగ్గరుండి శుభ్రం చేయించారు. రాజకీయ నాయకుల పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఉన్న మద్యం బాటిళ్లను గుర్తించి మందుబాబులతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఆయన వెంట ఎస్ఐ వేమన ఉన్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



పుల్లలచెరువు,నవంబరు 8(ఆంధ్రజ్యోతి):కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. అందిన వివరాల ప్రకారం పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన మేకల రేణుక(20) తీవ్రమైన కడుపునొప్పితో కొద్దిరోజులుగా బాధపడుతుంది. ఈక్రమంలో ఈ నెల 3వ తేదీన ఎలుకల మందు తినింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వినుకొండ వైద్యశాలకు తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్ మృతిదేహాన్ని పరిశీలించారు. రేణుకకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా ఉద్యమ పోరు పోస్టర్ ఆవిష్కరణ

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న వైఎస్సార్ పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమ పోరును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆయన ఐదు మండలాల నాయకులతో కలసి అవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్


అద్వానీ పుట్టినరోజు వేడుకను నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా అద్వానీ జన్మదిన వేడుకలు

గిద్దలూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకులు, జాతీయ పార్టీ మాజీ అధ్యక్షులు లాల్‌క్రిష్ణ అద్వానీ జన్మదిన వేడుకలను శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, నాయకులు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం డాక్టర్ నారాయణ మాట్లాడుతూ అద్వానీ ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, ఆర్.కాసులు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాపులకు జనసేన పార్టీ అండ


మాట్లాడుతున్న స్వాములు

కంభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జనసేన పార్టీ అండదండలతోనే కాపులకు మంచి భవిష్యత్ ఉంటుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాపు కన్వీనర్ ఆమంచి స్వాములు తెలిపారు. శనివారం కంభం మండలం చిన్నకంభం గ్రామ వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో బలిజ కార్తీక వనభోజనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కందుకూరు లాంటి ఘటనలు పునరావృతం కాకూడదని, హత్యకు గురైన లక్ష్మీనాయుడు కుటుంబానికి ప్రభుత్వంతోపాటు కాపులు ఆర్థికంగా చేయత నిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కంభం బలిజ సేవా సంఘం వారు రూ.30వేలు సాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంఘ అధ్యక్షుడు సూర్యప్రసాద్, పగిడి రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కుప్ప రంగనాయకులు, రాయల్ పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షుడు శేఖర్‌రాయల్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ


విత్తనాలను పంపిణీ చేస్తున్న జ్యోష్నాదేవి

తర్లుపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీపై ఇస్తున్న శనగ విత్తనాలను శనివారం వ్యవసాయ అధికారి జ్యోష్నాదేవి పంపిణీ చేశారు. ప్రస్తుతం కురిషిన వర్షాలకు రైతులు తేమశాతం చూసి విత్తనాలు వేసుకోవాలని సూచించారు. విత్తనాలు వేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దేవేందర్ గౌడ్, సావిత్రి పాల్గొన్నారు.

భోజన ప్లేట్ల అందజేత

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాశినాయన ఆశ్రమానికి యువప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ బోజన ప్లేట్లను అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్, సంస్థ సభ్యులతోపాటు యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

పొదిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని పెన్షనర్ల సఘం అధ్యక్షుడు ఏ బాదుల్లా అన్నారు. శనివారం పెన్షనర్ల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు వెంటనే 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని కోరారు. వేతన సవరణ జరగకపోవడంతో వాటి ఫలితాలను అనుభవించలేకపోతున్నార న్నారు. వైసీపీ తగ్గించిన మూడు శాతం అడిషనల్ క్వాం టంను పుణరుద్ధరించాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు ఏ వీరారెడ్డి, ప్రెసిడెంట్ డీఎల్ నరసింహారావు, కార్యదర్శి కేజే మోహన్‌రావు, మహిళా కార్యదర్శి దానమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండ

- బీమా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు టీడీపీ అండగా ఉండి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ సభ్యత్వం తీసుకొని మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5లక్షల చొప్పున చెక్కును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని ఓబురాయి సురేష్, అనుమల శ్రీనివాసులు, సగినాల విజయ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, వారి కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షానేషా వలి, కౌన్సిలర్ లొక్కు రమేష్, యూనిట్ ఇన్‌చార్జి బోయిళ్లపల్లి కిశోర్, కాతా రామచంద్రరెడ్డి, బనగాని నరసింహులు, నంద్యాల ఈశ్వరయ్య, సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, ఆవుల రాజగోపాల్, దూదేకుల దస్తగిరి పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం ఆవరణలో ఈనెల 10వ తేదీ కార్తీక సోమవారం ఉదయం 9గంటలకు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించనున్నట్లు అమ్మవారి శాల అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతం చేయించుకునే దంపతులు పూజా సామగ్రిని వారే తెచ్చుకోవాలని సూచించారు.

14న ప్రతిష్ఠ

గిద్దలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గరుకు స్తంభాల ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు పాములపల్లి సమీపంలోని బాదం రఘు తోటలో నిర్వహిస్తున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు, కార్యదర్శి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠ అనంతరం ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఏకలవ్యలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల, కళాశాలలో అతిథి బోధన కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఈశ్వర్ భరద్వాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సారానికి గానూ అతిథి బోధన విధానంలో సంగీతం-1 (ఫిమేల్), కౌన్సిలర్-1(ఫిమేల్), డాక్టర్-1 (మేల్/ఫిమేల్) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు పొంది ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు పాఠశాల, కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి సమాచారం కోసం ప్రిన్సిపాల్ 9416094165 నెంబరును సంప్రదించాలని కోరారు.

మొంథా తుఫాన్ ధాటికి 1, 647 హెక్టార్లలో పంట నష్టం

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజేశ్వరి

గిద్దలూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో మొంథా తుఫాన్ ప్రభావంతో 1,647 హెక్టార్లలో అన్ని రకాల పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజేశ్వరి అన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాలలో 1,136 హెక్టార్లలో పత్తి, 500 హెక్టార్లలో మొక్కజొన్న, 70 హెక్టార్లలో వరి, 49 హెక్టార్లలో సజ్జ, 2 హెక్టార్లలో కొర్ర తుఫాన్ కారణంగా నష్టం వాటిల్లినట్లు ఆమె తెలిపారు. ఆయా మండలాలలో వ్యవసాయాధికారులు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేసినట్లు రాజేశ్వరి అన్నారు. తుఫాన్ సమయంలో భారీ వర్షాలు, గాలివానల కారణంగా వ్యవసాయ భూములు వర్షం నీటిలో మునిగాయని, రైతులు కష్టపడి వేసిన పంటలు నీటమునిగి కొన్ని చోట్ల కొట్టుకుపోయినట్లు తెలిపారు. గ్రామాలవారీగా వివరాలను సేకరించి పంట నష్టంపై సమగ్ర నివేదిక సేకరించారని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు చెప్పారు. పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిధులు విడుదలైన వెంటనే రైతులకు అందజేస్తామని రాజేశ్వరి తెలిపారు.

నేడు హజరత్ నాసర్‌వలి గంధ మహోత్సవం

పొదిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాదాలవారిపాలెం గ్రామంలో వెలసిన హజరత్ నాసర్ మహమ్మద్‌వలి గంధ మహోత్సవం ఆదివారం జరగనుంది. ఉత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు, విద్యుదీపాలంకరణ చేశారు. సోమవారం రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వేమన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కంభాలపాడు గ్రామంలోని హజరత్ జిందేషా మదార్‌వలి గ్రంధమహోత్సవం కూడా ఆదివారం జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ఉత్సవానికి సిద్ధమైన మాదాలవారిపాలెం దర్గా

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


చెంచు గిరిజనులకు నిత్యావసరాలను అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో ఉంటున్న చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని కొర్రప్రోలు చెంచు గిరిజన గూడెంలో లైట్ ఫర్ బ్లైండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడ్డ గిరిజనులకు నిత్యావసర సరుకులను ఎరిక్షన్‌బాబు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఆర్గనైజర్ దాసరి స్వర్ణలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన చెంచుల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం ఆది నుంచీ కృషి చేస్తూనే ఉందన్నారు. ఎన్టీఆర్ ఐటీడీఏను ఏర్పాటు చేశారని, తద్వారా గూడేలలో మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మరిన్ని పథకాలు అమలు చేశారన్నారు. ట్రైకార్ రుణాలు, పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం, యువకుల ఉన్నత విద్యకు ఆర్థిక సాయం, గిరిజన యువతుల వివాహానికి పెళ్లికానుక వంటి పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నింటినీ రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో కలెక్టర్ మండలానికి రానున్నారని చెంచుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్‌మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, ఎలకపాటి చంచయ్య, దర్శనం దేవయ్య, ఒంటేరు రాఘవ, షేక్ మౌలాలి, కే సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పామూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పామూరు సింగిల్‌విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు అన్నారు. శనివారం పట్టణంలోని 277 బూత్ పరిధిలోని కుటుంబ సాధికారిక సభ్యుల(కేఎస్ఎస్) సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యక్రమాల్లో కేఎస్ఎస్ సభ్యులకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమీర్‌బాబు, బూత్ కమిటీ ఇన్‌చార్జ్ బి.నాగేశ్వరరావు, హజీగౌస్, ఎస్.నారాయణ, ఖాజారహంతుల్లా, ఎస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

రేపు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముండ్లమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిపాడులో అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనుంది. ఈసందర్భంగా శనివారం గణపతి పూజలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు యాగశాలలో గణపతి హోమంతో పాటు వివిధ పూజలు ప్రారంభమయ్యాయి. అదే పంచాయతీలో శివాలయం ఎదురుగా అర్ధనారేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. రెండు చోట్ల పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు.

అక్టోబరు విప్లవం స్ఫూర్తిదాయకం

దొనకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దోపిడీ, పీడన నుంచి ప్రపంచ మానవాళికి విముక్తి మార్గాన్ని చూపిన అక్టోబరు విప్లవం ప్రపంచానికి నిత్యం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. అక్టోబర్ సోషలిస్ట్ విప్లవ దినోత్సవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దొనకొండలో మండల నాయకుడు చిరుపల్లి అంజయ్య శనివారం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటి సారిగా దోపిడీరహిత సమానత్వ సమాజం 1917లో సోవియట్ రష్యాలో ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కర్నా హనుమయ్య, కుందుర్తి చిన్ననర్సింహులు, కోలా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మృతి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం సింగిల్‌విండో ఛైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి తండ్రి, టీడీపీ నాయకుడు చెరుకుపల్లి తిరుపతిరెడ్డి (75) శనివారం మృతి చెందారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఆయనకు భార్య చెంగాలమ్మ ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పామూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యదేవుని దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నెల్లూరు మాడరన్ ఐఅండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు కిందపడి యువకుడు మృతి

కురిచేడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం కురిచేడు రైల్వే స్టేషన్‌లో జరిగింది. నరసరావుపేట ఎన్జీవో కాలనీకి చెందిన శివయ్య కురిచేడులో శుక్రవారం యోగయ్య స్వామి మఠంలో సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమానికి హాజరయ్యారు. రాత్రికి తిరునాళ చూసుకుని ఉదయాన్నే నరసరావుపేటకు వెళ్లేందుకు రైలు ఎక్కబోతూ జారి రైలు కిందపడి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ ఈవిషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వారు బయటకుతీసి పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అంజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- **11న పీసీపల్లి మండలంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ప్రారంభం**
- **అధికారులకు పలుసూచనలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**


సీఎం పర్యటనపై పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలం పెదయిర్లపాడు రెవెన్యూ పరిధిలోని లింగన్నపాలెంలో నిర్మితమైన ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఈనెల 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధు లు, జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొననున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) నుంచి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి సమాచారం అందింది.

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో డాక్టర్ ఉగ్ర శనివారం అధికారులతో కలిసి ఎంఎస్ఎంఈ పార్క్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏచిన్న సమస్య తలెత్తకుండా చకచకా ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఈపార్క్‌తో వెనుకబడిన ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధికి కొత్త దశ ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే ఉగ్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, సీఐ షేక్ ఖాజావలి, ఏఎంసీ ఛైర్మన్ యారవ రమాశ్రీనివాస్, మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, పులి ప్రతాప్‌రెడ్డి, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, మూలె మహేంద్రరెడ్డి, వీరయ్య, క్రిష్టారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మూలుగుతున్న నిధులు

- **వినియోగంపై దృష్టిసారించని అధికారులు**
- **గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు**


దొనకొండ మండల పరిషత్ కార్యాలయం

దొనకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండల పరిషత్ కార్యాలయంలో రెండేళ్లుగా నిధులు పేరుకుపోయాయి. వీటి వినియోగంపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్త మవుతున్నాయి. 2024-25, 2025-26 రెండు సంవత్స రాలకు చెందిన దాదాపు కోటి రూపాయల నిధులను ఎటువంటి అభివృద్ధి పనులకు కేటాయించలేదు. దీంతో ఈనిధులు బ్యాంకులో మూలుగుతున్నాయి. ఈ నిధు లను మండల పరిషత్ తీర్మానాలతో ఎంపీటీసీ సభ్యుల ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, సైడు కాల్వలు, మెటల్‌రోడ్లు, తాగునీరు తదితర ప్రజల అవసరాలకు చెందిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో ప్రజలకు ప్రధాన అవసరమైన పనులు గుర్తించి నిధు లు సద్వినియోగం జరిగేలా చర్యలు చేట్టాలి. ఉన్నతాధి కారుల పర్యవేక్షణలేక సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

దొనకొండ మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు గాను 13చోట్ల వైసీపీ గెలుపొందింది. ఒక్క ఆరవల్లిపాడు ఎంపీటీసీ స్థానం టీడీపీ ఖాతాలో చేరిం ది. అప్పటి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆశీస్సులతో వెంకటాపురం ఎంపీటీసీగా గెలుపొందిన ఉషారాణి ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం దర్శి నియోజక వర్గంలో వైసీపీలో జరిగి న రాజకీయ మార్పులు, తదనంతరం 2024 ఎన్ని కల సమయంలో మండ లంలోని వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీ స భ్యులు టీడీపీలో చేరారు. ఆఎన్నికల్లో కూటమి అధి కారంలోకి వచ్చింది. రెండే ళ్లుగా మండల పరిషత్ లో పేరుకుపోయిన నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించేందుకు వైసీపీకి చెందిన ఎంపీపీ, టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుల మధ్య ఒప్పందాలు కుదరకపోవటంతో మూలుగుతున్నాయి. ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తయ్యేలోపు మండలపరిషత్ లో పేరుకుపోయిన నిధులను వారి పరిధిలోని గ్రామాలకు కేటాయించి అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజ లు కోరుతున్నారు.

అధ్వానంగా బొద్దికూరపాడు శంకరనారాయణపురం రోడ్డు

తాళ్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు-శంకరనా రాయణపురం రోడ్డు అధ్వానంగా ఉంది. బొద్దికూరపాడు గ్రామ ప్రజలకు ఈమార్గంలో దాదాపు రెండువేల ఎకరాల భూములు ఉన్నాయి. 500 మంది రైతులు ప్రతినిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం ఈరోడ్డు గుండా రాకపోకలు సాగి స్తుంటారు. రోడ్డు పక్కనే మాగాణి పొలాలు ఉండటంతో నీటి ఊటలతో ఈరోడ్డు మాగాణిని తలపిస్తున్నది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంప, పిచ్చి మొక్కలు అల్లుకుని ఉన్నాయి. పొలాలకు ట్రాక్టర్ల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు గుంతలమయంగా మారింది.

రోడ్డు బంక మట్టితో ఉండటంతో ద్విచక్రవాహనదారులు జారిపడుతూ గాయాలపాలవుతున్నారు. పశువులకు గడ్డి మేత తెచ్చుకునేందుకు ఈరోడ్డు గుండా వెళ్లాలంటే ప్రాణాంతకంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈరోడ్డు దారుణంగా తయారైంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి తమ్మ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా ఉన్న రోడ్డు

వైసీపీని వీడి పలువురు టీడీపీలో చేరిక

పీసీపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలోని తలకొండపాడు, పాలేటిపల్లి గ్రామాలకు చెందిన 11కుటుంబాలు వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరారు. కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో జరి గిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృ ద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసం నింపుతున్నాయ న్నారు. అదే విశ్వాసంతో తలకొండపాడు పంచాయతీ లోని పాలేటిపల్లి, తలకొండపాడు గ్రామప్రజలు టీడీ పీలో చేరడం అభినందనీయమన్నారు. టీడీపీలో చేరి నవారిలో ఏసురత్నం, దేవదాసు, ఇషాక్, మేరి, వెం కటేశ్వర్లు, పద్మ, శ్రీనివాసులు, వెంకటనారాయణ, కోట య్య, వెంకటేశ్వర్లు, సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నెలకుర్తి మాల్యాద్రి, సర్పంచ్ ముప్పూరి మాల్యాద్రి, పోలినేని మాలకొండయ్య, కూరపాటి లక్ష్మణ్, కూరపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఉగ్రను కలిసిన మైనార్టీ నాయకులు

పామూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పామూ రులోని ఎర్రచేలు పరిధిలో నూతనంగా నిర్మించే బొవు మజీద్ అండ్ మదర్సా నిర్మాణ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని పామూరు ముస్లింలు శనివారం కలిసి ఆహ్వానించారు. కనిగిరిలోని అమరావతి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈనెల 24న శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం టీడీపీ ముస్లిం మైనార్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన షేక్ జం షీర్‌ను శాలువాతో సన్మానించారు.

ఉగ్రను కలిసిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు స య్యద్ అమీర్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ హజీగౌస్, మదర్సా నిర్వాహకుడు మౌలాన షరీఫ్, కోడి గుంపల నాయబ్‌రసూల్, ఖాదర్, రసూల్, తదితరులు ఉన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీరాం

ఉరివేసుకుని వ్యక్తి మృతి

కనిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కూచిపూడిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాతకూడిపల్లికి చెందిన జొన్నలగడ్డ సుజన్(52) మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడుతున్నాడు. మేస్రి పనికి వెళ్ళకుండా గత నెల రోజులుగా మద్యం తాగుతూ భార్యను పనికి వెళ్లాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఈక్రమంలో మృతుడి భార్య కందుకూరు లోని తన సోదరి ఇంటికి నాలుగు రోజులు క్రితం వెళ్ళింది. కనిగిరిలోనే నివాసం ఉంటున్న మృతుడి కుమార్తె శనివారం తన పుట్టింటికి వచ్చేసరికి తండ్రి సుజన్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటాన్ని గమనించింది. పోలీసులకు సమాచారం రావటంతో ఎస్ఐ శ్రీరాం సిబ్బందితో కలసి ఘటనాస్థలికి వెళ్ళి పరిశీలించారు. మృతుడి కుమార్తె నుంచి వివరాలు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరాం తెలిపారు.

వెలిగొండను పూర్తిచేయటంలో ప్రభుత్వాలు వైఫల్యం

- **మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధ్వజం**

కనిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయటంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధ్వజమెత్తారు. పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లోని డాక్టర్ గురుబ్రహ్మం యోగా కేంద్రంలో శనివారం జరిగిన వెలిగొండ సాధన సదస్సులో ఆయన మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా నిధుల లేమితో నత్తనడక నడుస్తున్న ఈప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.4 కోట్లు కేటాయించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2025 - 26 రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.నాలుగు వందల కోట్లు మాత్రమే కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు కోట్లు అవసరమైన ప్రాజెక్టును 2026 ఆగస్టు నాటికి ఏవిధంగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అబద్ధపు వాగ్దానాలు మానుకుని అవసరమైన రూ.4వేల కోట్లను విడుదలచేసి వెనుకబడిన ప్రశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు సాధన కోసం ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.

వెలిగొండ పూర్తయితే వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయని ఎమ్మెల్సీ లక్ష్మణరావు పేర్కొన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఫ్లోరైడ్ నుంచి ప్ర జలు విముక్తి పొందుతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి ప్రజలకు మేలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాచర్ల శివప్రసాద్, ముక్కు బాలక్రిష్ణారెడ్డి, జేవీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్, టి.ధనుంజయ రెడ్డి, డాక్టర్ పి.చెన్నకృష్ణయ్య, జయప్రకాష్, శ్రీనివాసరెడ్డి, వి.మాలకొండారెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు శ్రీను, ఎస్కే ఖాజాహుస్సేన్, రంగారెడ్డి, షేక్ జిలాని బాషా, షరీఫ్, వెంకట్రావ్, కోటిరెడ్డి, పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

పామూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా ఒకటో తేదీనుంచి రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు సక్రమంగా రేషన్ సరుకులను పంపి ణీ చేయాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. నెలవారీ తనిఖీలో భాగంగా పట్ట ణంలోని రేషన్ గోడౌన్‌లోని సరుకులను, స్టాకు రిజిస్టర్లను, రేషన్‌షా పులను శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురు కార్డుదారు లకు చెందిన రేషన్‌స్మార్ట్ కార్డులతో క్యూఆర్‌కోడ్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేశారు. పేదవారికోసం ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం పక్క దారి పడితే చర్యలు తప్పదని హెచ్చరించారు. ఈసందర్భంగా బియ్యం స్టాకు పరిశీలించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీటీ భూపతి, గోడౌన్ డీటీ ఆర్.రమేష్, ఎఫ్ఐ బి.మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్‌కు కేరాఫ్ నాయక్

పామూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీస్‌కు కేరాఫ్ సీఐ భీమానాయక్ అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరు సీఐగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన భీమానాయక్‌ను స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఐ టి.కిశోర్‌బాబు అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసే కొద్ది మంది అధికారులలో భీమానాయక్ ఒకరన్నారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశి రెడ్డి, టీడీపీ నాయకులు బొల్లా నరసింహారెడ్డి, బొబ్బూరి రాజేష్, పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

వెలిగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ప్రమాదవశాత్తు మరణించిన టీడీపీ కార్యకర్త ఏసేపోగు జాన్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి అందజే శారు. మండలంలోని ఇమ్మడిచెరువు పంచాయతీకి చెందిన జాన్ ఇటీవల పాము కాటుతో మృతి చెందాడు. ఈనేపథ్యంలో బాధిత కుటుంబానికి ఎ మ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి చొరవతో బీమా చెక్కును శనివారం అందజే శారు. అలాగే, మండలంలోని రాళ్ళపల్లి గ్రామానికి చెందిన నన్నసాని రత్తమ్మకు రూ.25 వేలు సీఎంఆర్‌ఫ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఇంద్రభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అండగా నిలుస్తున్నారని అన్నారు. దేశంలో ఏరాజకీయ పార్టీకి లేనివిధంగా టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటుచేశారన్నారు. కార్యక్ర మంలో ముత్తిరెడ్డి, బొబ్బా రమణారెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, సాన జయ పాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన

దొనకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరవల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ తల్లుల వర్క్‌షాప్‌ను ఐటీసీ ప్రథమ్ జి ల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యం లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న పండ్ల వ్యాపారి



పండ్ల వ్యాపారి గౌస్‌బాషాను అభినందిస్తున్న డీఎస్పీ సాయి-ఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారి తనకు దొరికిన రూ.7 లక్షల విలువైన బంగారు ఆభరణాలను, నగదును పోలీసులకు అప్ప గించి నిజాయితీని చాటుకున్నారు. ఈ సంఘటన శనివారం కనిగిరి పట్ట ణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన షేక్ గౌస్‌బాషా నగరికంటి బసవయ్య సెంటర్ వద్ద తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈక్రమంలో రోజుమాదిరిగానే పండ్ల వ్యాపారం చేసుకుం టున్న తన వద్దకు ఓవ్యక్తి వచ్చి పండ్లు కొనుగోలుచేసి తీసుకెళ్ళాడు. ఆ సమయంలో తన చేతిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఉన్న హ్యాం డ్ బ్యాగ్‌ను అక్కడే వదిలేసి వెళ్లాడు. ఆ బ్యాగ్‌ను చాలాసేపటి తర్వాత పండ్ల వ్యాపారి గౌస్‌బాషా గమనించి తెరచిచూడగా అందులో రూ.50 వేలు నగదు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. దీంతో ఆ బ్యాగ్ ఎవరదని విచారించినా తెలియలేదు. ఆబ్యాగ్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగిం చారు. పోలీసులు విచారణ చేపట్టగా పట్టణంలోని కూచిపూడిపల్లికి చెందిన మరో కూరగాయల దుకాణం యజమానిదిగా గుర్తించారు. దీంతో బంగారు ఆభరణాలను, నగదును యజమానికి అప్పగించారు. పండ్ల వ్యాపారి నిజాయితీని సీఐ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాంలు డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ దృష్టికి తీసుకెళ్లారు. పండ్ల వ్యాపారిని డీఎస్పీ అభినందించి ఘనంగా సత్కరించారు. బంగారు ఆభరణాల బ్యాగ్ యజమాని బేతంశెట్టి మల్లయ్య పండ్ల వ్యాపారికి కృతజ్ఞతలు తెలిపారు.

www.andhrajyothy.com
8 పేజీలు
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI ఆదివారం 9-11-2025 బాపట్ల / ఒంగోలు


విదేశీ పర్యటనలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్


దివ్యాంగురాలికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి అంటే మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎనలేని మక్కువ. నియోజకవర్గ ప్రజలకు కూడా ఆయనంటే కొండంత అభిమానం. ఆ మక్కువ, అభిమానాలే వారి మధ్య విడదీయరాని అనుబంధాన్ని పెంచాయి. అది పార్టీలకతీతంగా రవికుమార్‌ను విజయపథంలో నడిపిస్తోంది. తాను ఉన్నత శిఖరాలను అందుకున్నా... 'నా అద్దంకి అభివృద్ధి' అనే తపన, ఆరాటాన్ని రవికుమార్‌లో పెంచింది. ఫలితంగా అద్దంకి అభివృద్ధిపథంలో పయనిస్తోంది. నిజానికి రవికుమార్ ఇప్పటికి ఐదు పర్యాయాలు శాసనసభకు ఎన్నికయ్యారు. అందులో గత నాలుగు పర్యాయాలు అద్దంకి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అద్దంకిలో తొలి రెండు సార్లు వేర్వేరు పార్టీల నుంచి విజయం సాధించిన ఆయన గత రెండు పర్యాయాలు తెలుగుదేశం నుంచి గెలుపొందారు. టీడీపీలో చేరిన తర్వాత రాజకీయంగా బలంగా ఎదిగారు. నియోజకవర్గంలో నిలదొక్కుకున్నట్లే.. నిబద్ధతతో పనిచేసి టీడీపీలోనూ అందలానికి చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు తలలో నాలుకలా మారారు. ఆపై రాష్ట్ర మంత్రి అయ్యారు. పదవులు వరించాయి.. పరపతి పెరిగింది.. అంతకుమించి బాధ్యతలు పెరిగాయి.. దీంతో రవికుమార్ నియోజకవర్గానికి దూరమవుతారని ప్రజలు భావించారు. కానీ అలా కాకుండా.. రవికుమార్ నియోజకవర్గంపై మరింత దృష్టి సారించారు. రోజులో ఒకపూట నియోజకవర్గం, మరోపూట సచివాలయం అన్నట్లుగా ప్రజలతో కలిసి తిరుగుతూనే ఉన్నారు. దానికి తోడు పెరిగిన పరపతి, లభించిన మంత్రి పదవితో మరింత అభివృద్ధికి శ్రీకారం పలికారు. గతంలో కేవలం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే భవనాసి రిజర్వాయర్‌కు బీజం వేశారు. పాలిటెక్నిక్ కాలేజీని తెచ్చారు. సాగర్ కాలువల రూపురేఖలు మార్చి రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రమారమి 3వేల మందికిపైగా వైద్య చికిత్సలకు ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించారు. ఇప్పుడు మంత్రి పదవి కూడా ఉండటంతో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. రూ.120 కోట్ల వ్యయంతో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం పలికారు. మరో రూ.100 కోట్ల నిధులను రోడ్ల నిర్మాణానికి సాధించారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని రాబట్టడంలో రాష్ట్రంలో మొదటి మూడు స్థానాలలో ఒకరిగా నిలిచారు. ఇప్పటికే 1,700 మందికి సీఎం సహాయ నిధిని అందించగలిగారు. ఇంకోవైపు 10వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీకి శ్రీకారం పలికి ఇప్పటికే 4వేల మందికి ఇచ్చారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, చిరువ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ లాంటి చేయూత కార్యక్రమాలు భారీగా చేస్తున్నారు. సాగర్ కాలువల అభివృద్ధికి సొంత నిధులు సైతం వెచ్చిస్తున్నారు. అద్దంకి రూపురేఖలు మార్చి నగర స్థాయిని కల్పించే పనిలో రవికుమార్ నిమగ్నమయ్యారు. అందులో భాగంగా మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రయాణానికి అనువుగా మోటుపల్లి నుంచి ఎర్రగొండపాలెం సమీపంలోని కుంట వరకు రోడ్డు నిర్మాణానికి చొరవ చూపారు. ఆయన ఎంత ఎదిగినా, ఎన్ని బాధ్యతలు తలపై పడినా అద్దంకి అభివృద్ధి-అద్దంకి ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత అన్న చందంగా ముందుకు సాగుతూ ప్రజాభిమానాన్ని మరింత పెంచుకుంటున్నారు.


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్


పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రవికుమార్

అందరివాడు



అభిమానం... అనుబంధం.. అభివృద్ధి..

- హామీల అమలులో దిట్ట
- తిరిగి ప్రకాశంలోకి అద్దంకి
- మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయికి పెరుగుతున్న హోదా
- అద్దంకి అభివృద్ధి కోసం అహరహం కృషి
- ప్రజలతో మమేకం
- పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాభిమానాన్ని మరింత పెంచుకున్న మంత్రి రవికుమార్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కీలకమైన హామీలను అమలు చేయడంలో మంత్రి రవికుమార్ సఫలీకృతులయ్యారు. ప్రధానంగా ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో కోరిన విధంగా అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలోకి చేర్పించే విషయంలో చాకచక్యంగా వ్యవహరించారు. ఎన్నికలకు ముందే ఇటు చంద్రబాబు, అటు లోకేష్ ద్వారా ప్రజలకు బహిరంగంగా హామీ ఇప్పించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాపట్ల జిల్లా నుంచి మంత్రి పదవి పొందిన రవికుమార్ జిల్లా మార్పు విషయంలో వెనకడుగు వేయవచ్చని రాజకీయ పరిశీలకులు ఊహించారు. అయితే రవికుమార్ మాత్రం ఆ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదిపారు. తొలుత అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రతిపాదించారు. తనకు సన్నిహితుడైన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పరిస్థితిని వివరించి ఒప్పించారు. ఆతర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా నియోజకవర్గస్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు ఉన్న సంబంధిత అధికారులతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేయించారు. ప్రతిపాదన ఓకే కాగానే జిల్లా మార్పుపై దృష్టి సారించారు. తదనుగుణంగా అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపే విధంగా మంత్రివర్గ ఉపసంఘం సభ్యుల దృష్టికి తీసుకెళ్లి వారి నివేదికలో పొందుపర్చారు. ముందుగా రెవెన్యూ డివిజన్‌కు రంగం సిద్ధంచేయడంతో నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చే అంశం వచ్చినా డివిజన్ ప్రతిపాదనకు ఇబ్బంది లేకుండా లైన్ క్లియర్ అయింది. ఈ విషయంతోపాటు పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు కూడా గతంలో చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వారిని అప్రమత్తం చేశారు. మంత్రి వర్గ ఉపసంఘంలో రవికుమార్ లేనప్పటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డివిజన్ల ఏర్పాటు, నియోజకవర్గాల మార్పు, కొత్త జిల్లా ఏర్పాటు విషయంలో ఆయన అభిప్రాయాన్ని కీలకంగా తీసుకోవడం విశేషం.

గ్రామస్థాయి వరకు అదే పంథా

నియోజకవర్గం నుంచి గ్రామస్థాయి వరకు ఏదైనా ప్రజాసమస్యలు, అభివృద్ధి పనులపై ఆయన హామీ ఇచ్చి ఉంటే వాటి అమలుకు శక్తివంచన లేకుండా పనిచేయడం కూడా గొట్టిపాటి నైజం. ఉదాహరణకు సాగర్ కాలువల మరమ్మతుల విషయంలో హామీ ఇచ్చారు. నిధుల మంజూరుకు జాప్యమవడంతో సొంత సొమ్ముతో తాత్కాలిక మరమ్మతులు చేయించి నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేశారు. లింకు రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా చేయూత విషయంపై ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఈ పర్యాయం సొంత నిధులు, దాతల సహకారంతో భారీగా చేపట్టారు.


పార్టీ కార్యక్రమంలో..

పాలన, పార్టీ వ్యవహారాల్లో కీలక బాధ్యతలు

- ఎక్కడ పార్టీ కార్యక్రమం ఉంటే అక్కడ మకాం
- రెండు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రి
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆంతరంగిక చర్చల్లో భాగస్వామి

పాలన, పార్టీ వ్యవహారాల్లో మంత్రి రవికుమార్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక బాధ్యతలు అప్పజెప్పడం విశేషం. పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఆయన్ను ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. వాటితోపాటు ఆయా సందర్భాల్లో రాజధాని సమీపంలోని కొన్ని జిల్లాల్లో సమస్యలు వచ్చినప్పుడు ప్రత్యేకంగా వాటి పరిష్కార బాధ్యతలు అప్పగిస్తున్నారు. పాలన, పార్టీ వ్యవహారాలపై అంతరంగికంగా జరిగే సమావేశాలకు అటు చంద్రబాబు, ఇటు లోకేష్ ప్రత్యేకంగా రవికుమార్‌ను పిలిపించుకొని మాట్లాడిన సందర్భాలు అనేకం. ముఖ్యనేతలతో పార్టీ వ్యవహారాలపై సమీక్ష జరిగినా రవికుమార్‌కు తప్పని సరిగా ఆహ్వానం అందుతోంది. అంతేకాక పార్టీ పరంగా ఏజిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగినా అక్కడ కీలక బాధ్యతలు నిర్వహించే వారిలో రవికుమార్ ఒకరిగా ఉంటున్నారు. మహానాడు నిర్వహణ సందర్భంగా కడప, సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహణ సందర్భంగా అనంతపురం, జీఎస్టీ విజయోత్సవం సందర్భంగా కర్నూలులో జరిగిన భారీ కార్యక్రమాల నిర్వహణల్లో రవికుమార్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయా జిల్లాల్లో నాయకుల మధ్య సమన్వయం, జనసమీకరణ అంశాల్లో అన్ని రకాల బాధ్యతల్లో రవికుమార్ కీలక పాత్ర పోషించారు. ఎవరు అవునన్నా కాదన్నా ఉమ్మడి జిల్లాలో పార్టీ, పాలనాపరమైన వ్యవహారాల్లో క్లిష్టమైన నిర్ణయం తీసుకునే సందర్భంలో రవికుమార్ అభిప్రాయాన్ని కచ్చితంగా అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు మంత్రి లోకేష్ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి.


ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న మంత్రి రవికుమార్


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

ఓర్పు... నేర్పు...

- అవే గొట్టిపాటి విజయ రహస్యాలు
- గ్రామంలో ఎన్ని గ్రూపులున్నా అందరూ ఆయన వెంటే

ఆంధ్రజ్యోతి, ఒంగోలు:

ఓర్పు, నేర్పుతో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో రాజకీయంగా విజయపథంలో పయనిస్తున్నారు. నాయకులను, పార్టీలో అభిమానులను తానెటున్నా తనకు మద్దతుగా నడిపించుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. గ్రామ, మండల స్థాయి రాజకీయాల్లో ఎలా ఉన్నా తనవరకు వచ్చే సరికి తనకు మద్దతుగా నిలబడే విధంగా వారిని చేసుకోవడంలో కూడా రవికుమార్ సఫలీకృతులవున్నారు. అందుకు ప్రధానంగా ఆయా నాయకులతో ఉన్న విషయాన్ని విడమర్చిచెప్పడం, ఎవరి అవసరాలకు అనుగుణంగా వారికి ప్రభుత్వ పథకాలను అందించడం, అభివృద్ధి పనులు చేయడం ద్వారా అందరి మద్దతు పొందగలుగుతున్నారు. అన్నింటికీ మించి కక్షసాధింపు రాజకీయాల జోలికి వెళ్లకపోవడం అందరి మద్దతు పొందడంలో కీలకమైంది. 2004 ఎన్నికలకు ముందు అనూహ్యంగా రాజకీయ అరంగేట్రం చేసిన రవికుమార్ తెలుగుదేశంలో చేరేందుకు ప్రయత్నించారు. అప్పట్లో మార్టూరు ఎమ్మెల్యేగా మాజీ మంత్రి హనుమంతరావు కుమారుడు నరసయ్య ఉన్నారు. ఆయన్ను కాదని మార్టూరు టికెట్ ఇవ్వలేనని చంద్రబాబు చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరిన రవికుమార్ ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. 2009 ఎన్నికల నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దవడంతో అద్దంకి నుంచి రంగంలోకి వచ్చారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసిన రవికుమార్ కాంగ్రెస్‌వాదులతోపాటు అప్పటి టీడీపీ నాయకుడు బలరాం వ్యతిరేకులను కలుపుకొని వెళ్లడంలో సక్సెస్ అయ్యారు. 2014లోనూ అదే పంథాలో ముందుకు సాగిన ఆయన, ఆ తర్వాత పూర్తిగా తనకంటూ ఒక ప్రత్యేక మద్దతుదారులను ఏర్పాటు చేసుకునే విషయంలో సఫలీకృతులయ్యారు. 2015లో తెలుగుదేశంలో చేరిన తర్వాత పైస్థాయిలో చంద్రబాబు మద్దతున్నప్పటికీ కిందిస్థాయిలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. అయినా నియోజకవర్గంలో తన అనుచరులతోపాటు టీడీపీ శ్రేణుల నుంచి కూడా లభించిన మద్దతుతో నిలదొక్కుకున్నారు. ఆ తర్వాత తన మద్దతుదారులను, టీడీపీ శ్రేణులను కలుపుకుపోవడంలో ఆయనకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 ఎన్నికల్లో బలరాంను చీరాల నియోజకవర్గానికి పంపి అద్దంకి నుంచి రవికుమార్‌ను పోటీలోకి దించారు. ఈ సందర్భంగా రవికుమార్ అనుచరులకు, టీడీపీలోని బలరాం వర్గీయుల మధ్య గ్రామాల్లో సమస్యలు ఎదురయ్యాయి. అవకాశం ఉన్న గ్రామాల్లో ఇరువైపుల వారి మద్దతు పొందడంలో రవికుమార్ వ్యూహం ఫలించింది. కొన్ని గ్రామాల్లో ఫలించకపోయినా రవికుమార్ విజేతగా నిలిచారు. ఆతర్వాత క్రమంలో చీరాల ఎమ్మెల్యేగా బలరాం వైసీపీలో చేరిన తర్వాత అద్దంకి నియోజకవర్గంలోని మరికొందరు టీడీపీలోని బలరాం అనుచరులు రవికుమార్‌తో కలిసేందుకు సిద్ధమయ్యారు. మేదరమెట్ల, అద్దంకి లాంటి కీలకప్రాంతాల్లో బలరాంకు కుడి, ఎడమ బుజాలుగా నడిచిన వారు గత ఎన్నికల సమయం నుంచి రవికుమార్‌తో పయనిస్తున్నారు. గత ఎన్నికల్లో గెలిచి రవికుమార్ మంత్రి అయి ఏడాదిన్నర అయినా కూడా అలాంటివారందరినీ టీడీపీ శ్రేణులుగానే తనతో నడుపుకోవడంలో సఫలీకృతులవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఆది నుంచి రవికుమార్‌తో ఉన్న టీడీపీ గ్రూపు, గత ఎన్నికల్లో రవికుమార్‌కు మద్దతు ఇచ్చిన టీడీపీ శ్రేణులకు ఏమాత్రం సఖ్యత లేదు. అయినా ఎక్కడా ఆయా గ్రూపుల నాయకులు బహిర్గతమై వాదనలకు దిగే పరిస్థితి రాకుండా అందర్నీ తనతో నడుపుకుంటున్న తీరు రవికుమార్ ఓర్పు..నేర్పునకు దర్పం పడుతోంది. ఇటీవల కొన్ని గ్రామాల్లో అనాదిగా టీడీపీలో ఉంటూ గత ఎన్నికల్లో రవికుమార్‌కు మద్దతిచ్చిన వారు చొరవగా ఆయన్ను కలవలేకపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను వారు ప్రచారం చేస్తున్నారు. మండలానికి ఒకట్రెండు గ్రామాల్లో మాత్రమే ఇలాంటి సమస్య ఎదురవుతున్న నేపథ్యంలో మున్ముందు వాటిని సవరించుకునేందుకు రవికుమార్ ప్రాధాన్యత ఇస్తారా? లేదా? అనేది చూడాల్సి ఉంది.

విద్యుత్ వెలుగులు

- అద్దంకి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు
- రెండు దశాబ్దాలపాటు ఎలాంటి కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు
- 40 ఏళ్ల నాటి స్తంభాల తొలగింపు

4





వైదన గ్రామంలో నిర్మాణంలో ఉన్న ముస్లిం షాదీఖానా

బల్లికురవ.. అభివృద్ధి భళా!



బల్లికురవ ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



మంత్రి రవికుమార్ కృషితో పెద్దఎత్తున నిధులు

- శరవేగంగా పనులు
- ఇప్పటికే చాలా వరకు పూర్తి
- బాలికా విద్యకు రూ.2 కోట్లు మంజూరు

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం అభివృద్ధిలో దూసుకుపోతోంది. మంత్రిగొట్టిపాటి రవికుమార్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని వైదన గ్రామంలో ముస్లిం షాదీఖానా నిర్మాణానికి మంత్రి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. పనులు తుది దశకు చేరాయి. అదేగ్రామంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం మరమ్మతులకు రూ.50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజురయ్యాయి.

మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.4 కోట్లతో పెద్దఎత్తున సీసీ రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించారు. మరో రూ.3 కోట్ల పనులకు నిధులు మంజురయ్యాయి. త్వరలో ప్రారంభం కానున్నాయి. పల్లె పండుగలో భాగంగా పశువుల కోసం గోకులం షెడ్లు నిర్మించారు. గ్రామాలలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.8.50 కోట్లు మంజురయ్యాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వసతి గదుల నిర్మాణానికి రూ.1.64 కోట్ల నిధులు మంజురు కాగా.. పనులు జరుగుతున్నాయి. కొమ్మినేనివారిపాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.30 లక్షలు, సూరేపల్లిలో సామాజిక భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. చెన్నుపల్లి, వైదన గ్రామాల పంచాయతీ రాజ్ రోడ్డుకు రూ.3 కోట్ల నిధులు మంజురు కాగా పనులు తది దశకు చేరుకున్నాయి. కొప్పెరపాడు నుంచి వెలమవారిపాలెం వరకు ఉన్న బీటీ రోడ్డు అభివృద్ధికి రూ.4.75 కోట్లు మంజూరయ్యాయి. బల్లికురవ-అద్దంకి రోడ్డులో ఏబీసీ కాలువపై రూ.2 కోట్లతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులు తుదిదశకు వచ్చాయి. బల్లికురవ నుంచి వయా కొణిదెన మీదుగా జాతీయ రహదారికి అర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజురయ్యాయి.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

మండలంలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా ఆర్డీఎస్ స్కీంలో పెద్దఎత్తున నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. బల్లికురవ, వేమవరం, కొప్పెరపాడు గ్రామాల సబ్ స్టేషన్లలో లోవోల్టేజ్ విద్యుత్ లేకుండా బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉన్న మల్లాయపాలెం గ్రామంలో నూతంగా విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వం మంజురు చేసింది. మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవతో అనారోగ్యం బారిన పడిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నగదు సాయం అందించారు. అలానే మంత్రి చొరవతో బల్లికురవ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వెయ్యి మంది విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల 11 గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కోసం ఒక్కో భవనాకి రూ.36 లక్షలు మంజూరయ్యాయి.



బల్లికురవ పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ ప్రత్యేక లైన్



వైదన గ్రామంలో అభివృద్ధి చేసిన సాంఘిక సంక్షేమ వసతి గృహం



గుంటుపల్లి కేజీబీవీ విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న వసతి గృహం



అద్దంకికి నిధుల వరద

- పట్టణంలో రూ.12.50 కోట్లతో అభివృద్ధి పనులు
- మినీ బైపాస్‌కు రూ.15 కోట్లు..
- టౌన్ హాల్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు



మినీ బైపాస్ గా మార్చనున్న అద్దంకి మేజర్ కాలువ కట్ట

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరయ్యాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి వీటిని రాబట్టారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే పెద్దఎత్తున పనులు చేపట్టారు. వీటిలో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అద్దంకి పట్టణంలో ఏడాది కాలంలో 15వఆర్థిక సంఘం నుంచి రూ.కోటి, బీపీఎస్ఎల్ఆర్ నిధులు రూ.2.10 కోట్లు, జనరల్ ఫండ్ రూ.2 కోట్లతో ఇప్పటికే పలు కాలనీలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం జరిగింది. ఇటీవల అద్దంకి పట్టణంలోని ఎస్సీ కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.1.25 కోట్లు మంజూరు కాగా పనులు చేపట్టేందుకు అంచనాలను సిద్ధం చేస్తున్నారు. అదానీ గ్రూప్స్ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.3.30 కోట్లతో పట్టణంలోని భవానీ సెంటర్‌లో అద్దంకి టౌన్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయి.

మినీ బైపాస్ నిర్మాణం వైపు అడుగులు

అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటంతోపాటు తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ మినీ బైపాస్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలి విడతగా పట్టణంలోని మీనాక్షి రెస్టారెంట్ నుంచి కాకానిపాలెం వరకు అద్దంకి మేజర్ కాలువ కట్టలను అభివృద్ధి చేసి సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అందుకు రూ.15 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రెండో విడతగా కాకానిపాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ సమీపంలోని 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నామ్ రోడ్డులో కలిసే విధంగా తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి రవికుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయితే పలు కాలనీల నుంచి నేరుగా రేణింగవరం రోడ్డు, ఒంగోలు రోడ్డు, శింగరకొండ రోడ్డు, బల్లికురవ రోడ్డులకు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. దీనితో పలు కాలనీలలో కొత్త ఇళ్ల నిర్మాణం పెరిగి అద్దంకి మున్సిపాలిటీకి పెద్దఎత్తున ఆదాయం కూడా సమకూరుతుంది. అద్దంకి పట్టణ రూపురేఖలు మరింత మారే అవకాశం ఉంది.



విద్యుత్ వెలుగులు

- అద్దంకి నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు
- రెండు దశాబ్దాలపాటు ఎలాంటి కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు
- నలభై ఏళ్లనాటి స్తంభాలు తొలగింపు
- కొత్త పోల్స్, లైన్‌ల ఏర్పాటు
- 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై కసరత్తు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గం విద్యుత్ వెలుగులతో కాంతులీననుంది. వచ్చే రెండు దశాబ్దాలపాటు కరెంటు సమస్య ఉత్పన్నం కాకుండా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో రూ.120కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంతోపాటు అత్యధిక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఎక్కువ భాగం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసినవే. దీంతో తరచూ విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రవికుమార్ వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. లోఓల్టేజీ సమస్యలు ఉత్పన్నంకాకుండా కొత్త సబ్‌స్టేషన్‌లు నిర్మిస్తున్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో సుమారు రూ.6కోట్లతో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్, టిడ్కో గృహసముదాయం, కొప్పెరం, మల్లాయపాలెంలలో రూ.18 కోట్లతో కొత్తగా 33 కేవీ సబ్‌స్టేషన్‌లు నిర్మాణంలో ఉన్నాయి. సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద సుమారు రూ.25 కోటతో 132 కేవీ సబ్ స్టేషన్ మంజూరైంది. అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి నాలుగు సబ్‌స్టేషన్‌లను అనుసంధానం చేస్తూ సుమారు రూ.3.5 కోట్లతో విద్యుత్ టవర్ల నిర్మాణం, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామాలలో విద్యుత్ లైన్‌ల మార్పు

నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాలలో ఏడాది క్రితం వరకు ఎక్కడ చూసిన వేలాడుతూ ఉండే విద్యుత్ తీగలు, విరిగిపడేందుకు సిద్ధంగా ఉండే స్తంభాలు దర్శనమిచ్చి. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాతవాటి స్థానంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలు, త్రిబుల్ ఫేస్ విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.80 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. కొత్తగా 160 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 10 వేల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేక విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మరో ఐదారు నెలలో అన్ని పనులు పూర్తయి ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా మెరుగైన సరఫరా జరగనుంది. దశాబ్ద కాలం క్రితం శింగరకొండపాలెం సమీపంలో 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు జరగ్గా.. కొత్తగా 220 కేవీ సబ్‌స్టేషన్ మంజూరుకు కసరత్తు జరుతోంది. అద్దంకిలో ఏర్పాటు చేసే 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి అద్దంకి, మార్టూరు, దర్శిలలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లకు, ఏల్చూరులో నిర్మించనున్న 132కేవీ సబ్‌స్టేషన్‌కు అందుబాటులో ఉండే విధంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. అన్ని పనులు పూర్తయితే నియోజకవర్గంలో గృహ, పరి శ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది



అద్దంకి లోని ద్వారకానగర్ వద్ద తుదిదశకు చేరిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

» ప్రకాశం జిల్లాలోకి నియోజకవర్గం » ఫలిస్తున్న మంత్రి రవికుమార్ కృషి



అద్దంకి పట్టణం వ్యూ

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా పరిధిలోకి చేర్చడంతో మూడేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో అద్దంకి నియోజకవర్గాన్ని చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చారు. ఇక పోలీస్ సబ్ డివిజన్‌లను కూడా ఇష్టానుసారం విభజించారు. అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లను చీరాల డీఎస్పీ పరిధి, బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లను బాపట్ల డీఎస్పీ పరిధిలోకి చేర్చారు. దీంతో ప్రజలు మరింత అయోమయానికి గురయ్యారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల పునర్విభజనపై దృష్టి సారించింది. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా పరిధిలోకి చేర్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అవి ఫలప్రదమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోకి చేర్చే ప్రతిపాదనతోపాటు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో అద్దంకి రెవెన్యూ డివిజన్, ప్రకాశం జిల్లా పరిధిలోకి అద్దంకి నియోజకవర్గం చేర్చే విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటైన తరువాత మిగిలిన అన్ని శాఖలకు సంబంధించి డివిజన్ కార్యాలయాలు కూడా అద్దంకిలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. డివిజన్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఉంచేందుకు మంత్రి రవికుమార్ ముందస్తు ప్రణాళికతో అద్దంకి పట్టణానికి సమీపంలో రేణింగవరం రోడ్డులో సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేయించారు. దీంతో అద్దంకి నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ, ఇతర పనులకు దూరం వెళ్లే కష్టాలు తప్పనున్నాయి.

అగ్నిమాపక కేంద్రానికి సొంత గూడు

» నాడు ఎమ్మెల్యేగా రవికుమార్ కృషితో అద్దంకిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు

» నేడు రూ.2.2 కోట్లతో భవన నిర్మాణం

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం లేదు. చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, చీరాల తదితర ప్రాంతాల నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చే సరికి అంతా బూడిదయ్యేది. ఈ నేపథ్యంలో 2013 డిసెంబరులో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కృషితో అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైంది. అయితే ప్రత్యేకంగా భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో తాత్కాలిక వసతి కల్పించారు. అగ్నిమాపక యంత్రం ఉంచేందుకు వీలుగా గొట్టిపాటి రవికుమార్ రూ.2 లక్షల సొంత నిధులతో రేకుల షెడ్ వేయించారు. సిబ్బంది కోసం మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రత్యేకంగా గదులు కేటాయింపు జేశారు. పలు దఫాలు అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు అయినా స్థలం అందుబాటులో లేక పోవడంతో ఆలస్యమైంది. పుష్కరకాలం తరువాత ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో రవికుమార్ మంత్రి కావడంతో అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం ఏర్పాటుపై దృష్టి సారించి అద్దంకి-శింగరకొండ మధ్య నామ్ రోడ్డు వెంబడి సుమారు రూ.2.25 కోట్లతో సొంత భవనం నిర్మాణానికి ఇటీవల మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరో నాలుగైదు నెలల్లో భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. పుష్కర కాలం తరువాత ఎట్టకేలకు అగ్నిమాపక శాఖ కు సొంత భవనం అందుబాటులోకి రానుంది. సిబ్బంది కష్టాలు కూడా తీరనున్నాయి.



శింగరకొండ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం భవనం

ప్రగతిలో పంగులూరు పరుగు

▸ మండలంలో శరవేగంగా పనులు ▸ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, భోజన శాలలు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్ నిరంతరం మండలంలో పర్యటిస్తూ గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు. పల్లె పండుగ పేరుతో గ్రామగ్రామానా సీసీ రోడ్లు నిర్మించారు. మండలంలోని 21 గ్రామాలలో తొలివిడత రూ.3.30కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. రూ.61లక్షలతో రామకూరులో సీసీ రోడ్డు, జనకవరం, కొండమంజులూరు గ్రామాలలో డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. నూతనంగా మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రోడ్లు, డ్రైన్‌ల పనులు ప్రారంభించనున్నారు. మండలంలోని కొండమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, జేవీపాలెం, జనకవరం, కొండమూరు. బూదవాడ గ్రామాలలో రూ.1.50కోట్ల డీఎంఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.

ముప్పవరంలో రూ.3కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం

మండలంలో ప్రధాన కూడలిగా ఉన్న ముప్పవరంలో చిరకాలంగా ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన మంత్రి గొట్టిపాటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. ముప్పవరం గ్రామానికి ఉత్తరంగా జాతీయ రహదారి నుంచి పంగులూరు, ముప్పవరం ఆర్‌అండ్‌బీ రహదారిని కలుపుతూ 1.5 కిలో మీటర్ల నిడివితో రూ.3కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు.

రూ.5.25కోట్ల ఉపాధి నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం

మండలంలో 5కోట్ల 25లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మూడు బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. కొండమూరు గ్రామం నుంచి పంగులూరు, ముప్పవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు 1.2 కిలో మీటర్ల నిడివిలో రూ.45లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రేణంగివరం నుంచి అలవలపాడు గ్రామం వరకు రెండు కిలో మీటర్ల పొడవున నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణానికి 2కోట్ల 80లక్షలు మంజూరయ్యాయి. మండలంలోని చందలూరు నుంచి గంగవరం వరకు 2కోట్లతో 3.6 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డును పునర్నిర్మించనున్నారు.

70లక్షల జడ్పీ నిధులతో పనులు

మండలానికి రూ.70 లక్షల జడ్పీ నిధులు మంజూరయ్యాయి. రూ.35లక్షలతో చందలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భోజన వసతి కోసం డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు. ముప్పవరంలో రూ.15లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. నూజెళ్లపల్లిలో 10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మిగతా 7వ పేజీలో


ముప్పవరం జాతీయ రహదారి నుంచి పంగులూరు ఆర్ అండ్‌బీ రోడ్డును కలుపుతూ నిర్మితమవుతున్న బైపాస్ రోడ్డు


కొండమూరు సాలిపేటలో నిర్మితమైన సీసీ రోడ్డు

మేజర్‌లు, మైనర్‌లకు మహర్దశ

- రూ.3.53 కోట్లతో సాగర్ కాలువల అభివృద్ధి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషి
- దశాబ్దాల నుంచి ప్రమాదకరంగా ఉన్న ఏబీసీపై రూ.2 కోట్లతో హైలెవల్ వంతెన


బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో సాగర్ మేజర్, మైనర్ కాలువలు చిట్టడవిలా తుమ్మ చెట్లతో నిండి ఉండేవి. ఆయకట్టులో చివర ఉన్న కాలువలు పూడిపోవడంతో ఏటా సాగుకు నీరు సక్రమంగా చేరక రైతులు తీవ్ర ఇబ్బంది పడు


మంత్రి రవికుమార్ చొరవతో అభివృద్ధి చేసిన గుంటుపల్లి మేజర్ కాలువ(ఫైల్)

తున్నారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టగానే రైతుల ఇబ్బందులను గమనించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో ఉన్న అన్ని మేజర్, మైనర్ కాలువల అభివృద్ధికి రూ.3.53 కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. అన్ని మండలాల పరిధిలో సాగర్ కాలువల నీరు వచ్చే మేజర్, మైనర్ కాలువల అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో మేజర్ కాలువలపై ఉన్న తుమ్మచెట్లతో రైతులు రాత్రుళ్లు నడిచే పరిస్థితి కూడా లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. బల్లికురవ మండలంలో ఉన్న గుంటుపల్లి, వైదన, వెంపరాల, చెన్నుపల్లి, గొర్రెపాడు, ముక్తేశ్వరం మేజర్లతోపాటు, అన్ని మైనర్ల కాలువల్లో చెట్లు తొలగించారు. పూడిక తీయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏబీసీ కాలువపై ప్రమాదకర వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటుతో చెక్

దశాబ్దాల నుంచి అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల సమీపంలో వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఎందరో ప్రమాదాల బారినపడి ప్రాణాలను సైతం కోల్పోయారు. నిత్యం రైతులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి వెళ్లేందుకు ఈ వంతెన ఎంతో ముఖ్యమైనది. ప్రజల సమస్యను తెలుసుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొటిపాటి రవికుమార్ హైలెవల్ వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో గత మూడు మాసాల నుంచి వంతెన పనులు దాదాపు తుది దశకు చేరాయి. ఇది పూర్తయితే పంట ఉత్పత్తుల రవాణాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించిన మంత్రి రవికుమార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


ఏబీసీ కాలుపై రైతులకు ఉపయెగపడేలా నిర్మిస్తున్న హైలెవల్ వంతెన

ప్రగతిలో పంగులూరు పరుగు

(6వ పేజీ తరువాయి)

జరిగింది. కోటపాడు ఉన్నత పాఠశాలలో రూ.10లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులు చేపట్టనున్నారు.

సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాలు, బస్ షెల్టర్

రూ.1.55 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆరు గ్రామాలలో సామాజిక భవనాలు, బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడు బీసీ కాలనీలో రూ.20లక్షలు, తక్కెళ్లపాడు ఎస్సీ కాలనీలో రూ.20లక్షలు, కొండమూరు ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో సామాజిక భవనాలు నిర్మించారు. కొండమంజులూరులో రూ.20 లక్షలు, పంగులూరు యాదవకానీలో రూ.20లక్షలు, బూదవాడలోని ధనలక్ష్మి కాలనీలో రూ.30లక్షలతో సామాజిక భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. నూజెళ్లపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో రూ.5లక్షలతో బస్‌షెల్టర్ నిర్మించారు.

పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సీఎస్ఆర్ నిధులతో మండలంలోని పంగులూరు, బూదవాడ, కొండమంజులూరు ఉన్నత పాఠశాలల్లో సుమారు వెయ్యి మంది బాలబాలికలకు సైకిళ్లను అందజేశారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో రూ.15లక్షలతో భోజనశాలను నిర్మించారు.

సాగర్ కాలువలకు మరమ్మతులు

మండలంలో అద్దంకి బ్రాంచి కాలువ పరిధిలోని పమిడిపాడు మేజర్‌తోపాటు దానికి అనుబంధంగా ఉన్న మైనర్‌లకు రూ.80లక్షలతో మరమ్మతులు చేయించారు. కాలువల్లో పెరిగిపోయిన చిల్లకంప తొలగింపు, పూడకతీత పనులు చేపట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న కాలువలకు వ్యవసాయ సీజన్‌కు ముందే మరమ్మతులు చేపట్టడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 9 నవంబరు 2025



స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం

- అధికారులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు దారులకు స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టగా ఎక్కడికక్కడ అధికారులు పట్టించుకోవడంలేదు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టులోనే స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. మూడు మాసాలు గడుస్తున్నా కార్డుదారులకు పూర్తిస్థాయిలో కార్డులు అందలేదు.

అధికారులు, డీలర్ల మధ్య సమన్వయలోపం

తొలుత కార్డుల పంపిణీ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. ఆ తర్వాత వాటి బాధ్యతను డీలర్లకు అప్పగించారు. అయితే వారు కుదిరిన సమయాల్లోనే, లేక కార్డుదారులు వెతుక్కుంటూ వచ్చినప్పుడు మాత్రమే కార్డులు అందజేస్తున్నారు. ఇప్పటికీ చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.

నూజెళ్లపల్లె సొసైటీ ఉద్యోగుల అరెస్టు

- మాజీ అధ్యక్షుడి సహా.. ఏడుగురికి రిమాండ్

వంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మూడేళ్ల క్రితం జరిగిన కుంభకోణంలో ఎనిమిది మంది ఉద్యోగులను అరెస్టు చేసినట్లు అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సొసైటీలో రూ.కోట్లలో నగదుతో పాటు బంగారం కూడా మాయమైనట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ జరిపారు. ఈ కుంభకోణంలో అప్పటి సొసైటీ అధ్యక్షుడు పెంట్యాల భద్రయ్య, సీఈవో అద్దంకి రవిబాబు, స్వీపర్ చెరుకూరి శివప్రసాద్, కొండ్రగుంట రవిబాబు, మద్దినేని సుబ్బ రామయ్య, నగరాజకుమారి, పాలపర్తి పోతురాజుతో పాటు మరోవ్యక్తి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో వీరిలో ఏడుగురిని అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరోవ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

15 నుంచి ధాన్యం సేకరణ

- జిల్లాలో 114 కేంద్రాల్లో కొనుగోళ్లు
- 2 లక్షల మెట్రిక్ టన్నులకు అనుమతి
- మిల్లర్ల మాయాజాలంపై ప్రత్యేక దృష్టి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి సివిల్ సప్లయిస్ విభాగం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ నెల 15 నుంచి జిల్లా వ్యాప్తంగా 114 కేంద్రాల్లో కొనుగోళ్లు జరపడానికి యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోంది. గత ఖరీఫ్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్‌లో రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులివ్వాలంటూ సివిల్ సప్లయిస్ విభాగం కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వైసీపీ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ 40,000 టన్నులకు మించలేదు. వాటి తాలూకా డబ్బులకు కూడా రైతులు నెలల తరబడి నిరీక్షించాల్సిన దురవస్థను రైతులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో దశల వారీగా 92,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం సేకరించింది. ఓ విధంగా ఇవే రికార్డు కొనుగోళ్లుగా అప్పట్లో నిలిచాయి. ఈ ఏడాది ఏకంగా ఆరంభంలోనే రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులివ్వడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలు అరికట్టడానికి...

ధాన్యం సేకరణలో అక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అన్నదాతలు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) వద్దే ధాన్యం తేమశాతం పరీక్షతో పాటు అక్కడే కొనుగోళ్లు జరపనున్నారు. రసీదు అందించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని వల్ల రైతులకు లాభం చేకూరనుంది. కల్లాల నుంచి నేరుగా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తీసుకెళ్లి ఆ తర్వాత రైతు సేవా కేంద్ర వద్ద నమోదు చేసే విధానానికి స్వస్తి పలికారు. దీని వల్ల సీఎంఆర్ లో అక్రమాలను కూడా అరికట్టి, రైతులు తరలించిన ధాన్యమే మిల్లుల్లో సీఎంఆర్ ప్రక్రియ జరగనుంది. గతంలో మిల్లర్లు రైతుల వద్ద నుంచి మద్దతు ధర కన్నా కూడా రెండు మూడొందలు తక్కువ చెల్లించి పెద్దఎత్తున ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేవారు. పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లతో కొంతమంది సిబ్బందికి ముడుపులు చెల్లించి ఆ ధాన్యాన్ని మద్దతుధర సేకరణ జాబితాలో చేర్చి పెద్ద ఎత్తున లాభపడేవారు. ప్రస్తుతం జీపీఎస్ అమలుతో పాటు తొలుత ధాన్యం ఆర్ఎస్‌కే కేంద్రం వద్దకే రావాల్సి ఉంది. అక్కడ నుంచే రైతులు మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే ప్రభుత్వం పంపింది. తద్వారా రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. కాగా మొంథా తుఫాన్, అంతకు ముందు వచ్చిన వరదల వల్ల వరిలో ఎక్కువగా తాలు ఏర్పడిందనేది అన్నదాతల మాటగా ఉంది. తేమ శాతంతో పాటు నిబంధనల విషయంలో సడలింపులు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.

తల్లిదండ్రులకు గుండెకోత

- టెక్సాస్‌లో కారంచేడు విద్యార్థిని మృతి

కారంచేడు(పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో బిడ్డ వస్తాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులకు గుండెకోత మిగిలింది. అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసుకుని ఉద్యోగ వేటలో ఉండగా అనారోగ్యంతో కుమార్తె మృతి చెందిందన్న వార్త తల్లిదండ్రులను శోకసంద్రంలోకి నెట్టేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రామకృష్ణ, వీణలకు కుమారుడు, కుమార్తె రాజ్యలక్ష్మి(రాజీ 23) ఉన్నారు. కుమారుడు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా.. చదువులో రాణిస్తున్న కుమార్తెను ఆర్థిక స్తోమత లేకపోయినా బీటెక్ వరకు చదివించారు. ఆ తర్వాత ఎంఎస్ చదుకుంటాను అనగా రాజ్యలక్ష్మిని అమెరికాకు పంపారు. 2023లో ఎంఎస్ పట్టా పొంది ఉద్యోగ వేటలో రాజ్యలక్ష్మి ఉంది. ఈ క్రమంలో అనారోగ్యం బారిన పడింది. శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె స్నేహితుల నుంచి తల్లిదండ్రులు సమాచారం అందింది. ఉన్నత ఉద్యోగంతో తిరిగి వస్తుందని ఎదురుచూస్తున్న కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్థిక భారంతో కుమార్తె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రాలేమని తల్లిదండ్రులు ఆవేదన వర్ణనాతీతంగా మారింది.



యార్లగడ్డ రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



- చెరుకూరులో.. కంచికామకోటి పీఠాధిపతి
- దేవాలయాలను సందర్శించిన స్వామి.. తరలివచ్చిన భక్తులు

భారతీయ సంస్కృతి గొప్పది

చెరుకూరు(పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని శ్రీకంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి తెలిపారు. మండలంలోని చెరుకూరు గ్రామంలోని పురాతన ఆలయాలను శనివారం ఆయన సందర్శించారు. గ్రామానికి చేరుకున్న స్వామికి వేదపడింతులు, అర్చకులు, మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. తొలుత 300 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీగంగా పార్వతీసమేత కోటేశ్వరస్వామి, శ్రీత్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయాల్ని పీఠాధిపతి దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను ధర్మకర్త పుచ్చా సూర్యానారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు పుచ్చా రాజగోపాల్, పుచ్చా దక్షిణామూర్తి పాల్గొన్నారు. స్వామి రాకతో గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నేడు పెదకాకానికి సీఎం చంద్రబాబు

- శంకరకంటి ఆస్పత్రిలో ఐ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



సీఎం ప్రారంభించనున్న ఐ హాస్పటల్

పెదకాకాని, గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం రానున్నారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగమనోహర్ బ్లాక్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీవాత్సవ పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా వేదిక ప్రాంగణాన్ని, ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణకాంత్, అధికారులు పాల్గొన్నారు.



కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు, సంఘాల నాయకులు

భక్తిభావాన్ని పెంపొందించిన కనకదాసు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక కవి,తత్వవేత్త కనకదాసు తన కీర్తనల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందింపజేశారని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కనకదాసు చిత్రపటానికి డీఆర్వోతో పాటు బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలజ్యోతి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు ఆయాశాఖల సిబ్బంది, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎల్. నాగేశ్వరరావు, రాచూరి శ్రీనివాసరావు, లంబు రాజేంద్ర, బక్కా సాంబశివరావు, బోలే శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మెప్మా ఉద్యోగులకు సీఎంఎం బెదిరింపులు

● 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఎలా వెళ్లిదంటూ చిందులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి బాగోతాలు, వాస్తవాలు వెలుగులోకి రావడంపై అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. గురువారం ఒంగోలులో జరిగిన మెప్మా ఎండీ తేజ్ భరత్ సమీక్ష సమావేశంలో పీడీ శ్రీహరి, ఒంగోలు సీఎంఎం సంతోష్‌లపై ఎంతో సీరియస్ కావడం, జరిగిన అంశాలపై ఒంగోలు సీఎంఎంకి అక్షింతలు వేయడంతో కలవరపడిన సీఎంఎం సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే అంశాలపై ఆరా తీయడంతోపాటు, సమావేశంలో పాల్గొన్న అధికారులను బెదిరించినట్లు సమాచారం. ప్రత్యేకించి సమావేశంలో జరిగిన వాస్తవాలను ఆంధ్రజ్యోతిలోనే ప్రచురించడం పట్ల పలువురిని బెదిరించడంతోపాటు, అసభ్య పదజాలంతో దూషించడం ఇప్పుడు మెప్మాలో చర్చనీయాంశమైంది. వార్త రాసిన వారికి, రాయించిన వారికి ఎక్కడ ఎలా? పెట్టాలో మాకు తెలుసు అంటూ నేరుగా బెదిరించడం పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మెప్మాలో జరుగుతున్న బోగస్ గ్రూప్‌ల వ్యవహారం, అధికారుల వసూళ్ల పర్వం, ఇతరత్రా అంశాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంపై అధికారులు మల్లాగుల్లాలు పడటంతోపాటు, సమాచారం బయటకు ఎలా వెళుతోంది? అనే అంశంపై పలువురు ఆర్పీలను, కార్యాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం.

స్కూటీని ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కళ్లగుంట శ్రీను

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కనుమళ్లలో జాతీయ రహదారిపై రన్ వే వద్ద అదే గ్రామానికి చెందిన కళ్లగుంట శ్రీను స్కూటీపై రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కావలి వైపు నుంచి ఒంగోలు వెళుతున్న లారీ అదుపుతప్పి శనివారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ లారీ ముందు టైరు కింద పడింది. దీంతో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలకు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. బాధితుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో స్వగ్రామం కనమళ్లకు వచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం సింగరాయకొండకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సింగరాయకొండ ఎస్సై వి.మహేంద్ర సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేడు మంత్రి గొట్టిపాటి జన్మదిన వేడుకలు

ముప్పవరం (పంగులూరు), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం 9 గంటలకు ముప్పవరంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని ముప్పవరం బీసీ వసతి గృహంలో బాలికలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా రావూరి రమేష్ విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ

● ఒకదాని వెనుక ఒకటి వస్తుండగా ఘటన
● క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్
● రెండు గంటలు కష్టపడి బయటకు తీసిన పోలీసులు



క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్

వేటపాలెం (చీరాల), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి, రెండు లారీలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. బాపట్ల నుంచి ఒంగోలు వైపు ఒకదాని వెనుక ఒకటి రెండు లారీలు వడ్లలోడుతో వస్తున్నాయి. వేటపాలెంలోని టపాసుల గోడౌన్ వద్దకు రాగానే, ముందు లారీ బ్రేకులు ఆకస్మికంగా పడ్డాయి. దీంతో ఒకవైపు తిరిగింది. దీని వెనుకే వస్తున్న మరో లారీ ముందున్న లారీని ఓ వైపుగా ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుకున్నాడు. ఒక కాలు బయటకు తీసే అవకాశం లేకుండా పోయింది. దీంతో వేటపాలెం జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకొని రెండుగంటల పాటు శ్రమించి క్యాబిన్‌లోని ర్యాడ్లను కట్ చేయించి డ్రైవర్‌ను బయటకు తీయించారు. చికిత్స నిమిత్తం వైద్యశాలకు పంపించారు. ఈ ఘటనతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్

● నగరంలో 8 బృందాలతో తనిఖీలు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శనివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎనిమిది ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదన చేస్తున్న 13మంది మైనర్లు, 33మంది రహదారి నిబంధనలు అతిక్రమించినవారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ మైనర్లు వాహనచోదన చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవల్సి ఉంటుందని హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదంటూ కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శ్రీనివాసరావు శనివారం ఒంగోలులో ఎస్పీ వి.హర్షవర్ధనరాజును కలిసారు. శ్రీనివాసరావుకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావు గతంలో పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

చదువుకున్న స్కూల్‌ను మరువొద్దు

● మంత్రి స్వామి
● ముప్పవరం స్కూల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

కొండపి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): చిన్నపుడు చదివిన స్కూళ్లను మరువొద్దని, విద్యాబుద్ధులు అందించిన స్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం దాతలు అందించాలని సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ముప్పవరం జడ్పీస్కూల్‌కు పూర్వ విద్యార్థులు దాదాపు 10 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పలు అభివృద్ధి పనులను స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సారథ్యంలో చేపట్టిందన్నారు. ఇదే సమయంలో స్కూళ్ల పూర్వ విద్యార్థులు కూడా తాము చదువుకున్న స్కూళ్ల పరిస్థితిని గమనిస్తుండాలని, ప్రజలు కూడా ప్రభుత్వ స్కూళ్ల పనితీరులో, వసతుల కల్పనలో భాగస్వాములు అవ్వడం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు మరింత బలోపేతం అవుతాయని, ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. జడ్పీస్కూల్‌లో 5 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు నిర్మించిన పెరిదేపి గ్రామానికి చెందిన ముప్పరాజు శ్రీనివాసరావును, స్కూల్ ముఖద్వారం, ప్రహరీగోడ, మొక్కలు ప్లాంటేషన్‌కు మూడు లక్షలు రూపాయలు వెచ్చించిన మిట్టపాలెం గ్రామ పూర్వ విద్యార్థి కొల్లూరి శ్రీహరిరావును, మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మిషనరీకి లక్షన్నర రూపాయలు అందించిన తాళ్లూరి రమాకుమారిని, వాటర్ ప్లాంట్‌కు, షెడ్డు నిర్మాణానికి లక్ష రూపాయలు ఇచ్చిన ప్రస్తుత స్కూల్ హెచ్‌ఎం బడే కోటిరెడ్డిని, భవిష్యత్ అవసరాలకోసం స్కూల్‌కు లక్షా యాభైవేలు అందించిన చిన్నం లక్ష్మీనర్సు కుటుంబాన్ని మంత్రి స్వామి ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా ఇక నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు పెరుగును అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కార్యక్రమంలో దాతలతోపాటు కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణ స్వామి, టీడీపీ నాయకుడు నరసారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎక్కిరాల భరద్వాజ విగ్రహ ప్రతిష్ఠ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 10వ తేదీన ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిరంలో జరుగుతుందని షిరిడి సాయి కల్చరల్ మిషన్, శ్రీభరద్వాజ్ విగ్రహ ప్రతిష్ఠ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం సాయిబాబా, సాయి మాస్టర్ విగ్రహాల నగరోత్సవం ఉంటుందన్నారు. ఇక 10వ తేదీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సాయి మాస్టర్ బృందావనంలో ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సమావేశంలో మందిర కమిటీ అధ్యక్షురాలు మల్లాది సుబ్బలక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, కార్యదర్శి మేడ జయరాం, ఉప కార్యదర్శి రుద్రవరపు సాయిబాబు, కోశాధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు గోపాలరావు, అంజయ్య, విజయ్ కుమార్, చంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, సాయి రాజు, సుధారాణి, ప్రమీలాదేవి, వాసు ఆచారి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళిత, బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత, బహుజనులు అలంకారప్రాయమైన పదవుల కోసం కాకుండా నిర్ణయం చేయగలిగే అధికారం కోసం ఉద్యమించాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తడ నుంచి తుని వరకు చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రికి నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్‌కాలనీలో నిర్మించిన ఐక్యతా స్థూపాన్ని ఆయన విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం చదలవాడ పశుక్షేత్రం ఎదురుగా ఉన్న వెంచర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికారం దళిత, బడుగు, బలహీన వర్గాలు, మహిళల చేతుల్లో లేదన్నారు.

పేదలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్న పాలకులు తదనంతరం వారికి నమ్మకద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నోచోట్ల దళితులపై దాడులు జరిగినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. సభలో పలువురు నాయకులు విజయ్‌కుమార్‌కు జ్ఞాపికలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయశ్రీ, దమ్ము చెన్నకేశవులు, ఎస్.కృష్ణాఫర్, ఇసుక గోపి, కేజీ.శ్రీనివాస్, వంతు శ్యాంప్రకాశ్, లేళ్లపల్లి చంద్ర, మాచవరపు జూలియన్, మల్లెల బుల్లెబ్బాయి, చిడితోటి శోభన్‌బాబు, చిడితోటి సుధీర్‌బాబు, మదన్‌మిశ్రా, హెప్సీబా, బుద్ధకోటి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప అఖండ పడిభజన



చీమకుర్తిలో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం

చీమకుర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని రామనగర్‌లో శనివారం రాత్రి అయ్యప్పస్వామి అఖండ పడిభజనను అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పోతురాజు శ్రీనుస్వామి తన ఇంటి ఆవరణలో భారీ సెట్టింగ్‌తో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శివ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో దీక్షదారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటినుంచి హరిహరక్షేత్రంలో అన్నసంతర్పణ

చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో సర్వదీక్షాధారులకు ఆదివారం నుంచి అన్నదానాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కలశ ప్రతిష్ఠ, విశేషపూజలు, పడిభజన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం అఖిత భారత యువజన సమాఖ్య ఆఫీసు బేరర్ల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కరుణానిధి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఆర్భాటపు ప్రచారాలు చేసి తరువాత విస్మరించారని మండిపడ్డారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమని, లేనిపక్షంలో ఐదువేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్, సహాయ కార్యదర్శి సబ్బు, రామాంజి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మూలగుంటపాడులో భూసమస్యల పరిష్కారం

● మంత్రి స్వామికి గ్రామస్థుల కృతజ్ఞతలు



మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీలోని 108/3 సర్వేనంబరులో గత ప్రభుత్వం రీసర్వే అసమగ్రంగా చేసిన కారణంగా భూముల రిజిస్ట్రేషన్ ఇబ్బందికరంగా మారింది. ఈ సర్వే నంబర్‌లో అధిక విస్తీర్ణం ఉంది. గడచిన ఏడాదికాలంగా ఈసర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో క్రయవిక్రయాలు ఆగిపోయి వందలాది మంది ఇబ్బందులు పడ్డారు. అయితే సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య దృష్టికి గ్రామస్థులు పలు దఫాలు తీసుకువెళ్లారు. ఈ సమస్యపై ఇరువురూ రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది. రిజిస్ట్రేషన్‌ల నిషేధాన్ని తొలగిస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, నాయకులు చిగురుపాటి గిరి, సన్నెబోయిన మల్లికార్జున, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా షూటింగ్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా బాల, బాలికల షూటింగ్ పోటీలు శనివారం ఒంగోలులోని నెక్స్‌జెన్ స్కూలులో ఉత్సాహంగా సాగాయి. ఈ మేరకు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేందుకు పోటీ పడ్డారు. రెండు రోజుల నుంచి ఎంపిక పోటీలు జరుగుతుండగా, ఆదివారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్కా వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, వ్యాయామోపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో రామాంజనేయులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ నేత బొమ్మినేని రామాంజనేయులు కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో అండర్-14 విభాగంలో ఎండ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారిని రామాంజనేయులు అభినందించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. హెచ్‌ఎం శేషిరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అద్దంకి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కరి పరమేష్ తదితరులు పరిశీలించారు.

దీక్షాదారులకు అన్నదానం

పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం సందర్భంగా దీక్షాదారులకు అన్నాదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలుగుయువత నేత పెంట్యాల రామాంజనేయులు తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● పూటుగా మద్యం సేవించి ఉండడంతో స్థానికుల ఆందోళన
● డ్రోన్, నిపుణుల పర్యవేక్షణలో రక్షణ ఏర్పాటు చేసిన పోలీసులు
● టవర్ నుంచి కిందకు దిగేలా కౌన్సిలింగ్



టవర్‌పై ఉన్న యువకుడు నిఘా ఉంచిన డ్రోన్



కిందకు దిగిన రాజేష్

బల్లికురవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్వారీలో పనుల నుంచి తొలగించారని మల్లాయపాలెం గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ఆత్మహత్య కు యత్నించాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉండడంతో ఎక్కడ పడిపోతాడో అని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు టవర్ వద్దకు చేరారు. ఉన్నతాధికారుల సూచనలు నిపుణుల సలహాలతో పాటు డ్రోన్ కెమెరాతో పూర్తి పర్యవేక్షణ ఏర్పాటు చేసి రాజేష్‌తో మాట్లాడారు. అతడిని ఒప్పించి టవర్‌పై నుంచి దింపారు. గ్రామానికి చెందిన వారి బంధువులను అక్కడకి పిలిపించి వారితో చర్చించారు. రెండు గంటల పాటు ఉత్కంఠగా సాగిన ఈ వ్యవహారం టవర్‌పై నుండి యువకుడు దిగడంతో సుఖాంతమైంది..

దొడ్డవరంలో విజృంభించిన గున్యా

● ఇబ్బందిపడుతున్న బాధితులు

మద్దిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామంలో గున్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానిక బీసీ కాలనీ, అరుంధతి నగర్‌లో పలువురు జ్వరంతో అల్లాడుతున్నారు. కొంతమంది రోగులు ఒంగోలులోని వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు ఇంటివద్ద ఉండి ఆర్ఎంపీలతో చికిత్స పొందుతున్నారు. అలాగే వారం రోజుల నుంచి విషజ్వరాలతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామంలోకి వైద్య సిబ్బంది వచ్చిన పాపాన పోలేదు. గ్రామంలో చిన్నారులు, వృద్ధులు జ్వరం ఒళ్లునొప్పులతో బాధపడుతున్నారు. కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికారులు స్పందించి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైనంపాడులో ఫాగింగ్

సంతనూతలపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మైనంపాడులో శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అనంతరం కాలువల్లో ఎబేట్, బ్లీచింగ్ చల్లించారు. ఇళ్ల వద్ద ఖాళీటైర్లలోను, తాగిపడేసిన కొబ్బరిబొండాల్లో నీటినిల్వలను ఉంచొద్దని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, సర్పంచ్ దాట్ల రమణమ్మ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కొమ్మమూరు కాలువ గండ్లను పరిశీలించిన ఎస్ఈ


కొమ్మమూరు కాలువ గండిని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరత్నం

చినగంజాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా మండల పరిధిలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను నీటి పారుదల శాఖాధికారులు శనివారం పరిశీలించారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటరత్నం, డీఈ ప్రసాదు, ఏఈ ఏ.శ్రీధర్‌లు కొమ్మమూరు కాలువకు పలు చోట్ల పడిన గండ్లను పరిశీలించారు. సోమవారం కేంద్ర పరిశీలనా బృందం తుఫాన్ వలన కొమ్మమూరు కాలువకు పడిన గండ్ల పరిశీలించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ

యద్దనపూడి(మార్టూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం కటారివారిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం మాజీ శాసనసభ్యులు దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, చీరాలకు చెందిన కాపునేత ఆమంచి స్వాములు హాజరయ్యారు. గ్రామంలోని చెరువకట్ట సమీపంలోని ఓవ్యక్తికి చెందిన సొంతస్థలంలో వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాపునేతలు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. స్థానిక ఎస్.ఐ. టిరత్నకుమారి బందోబస్తు నిర్వహించారు.

కుంకలమర్రులో అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.80 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కుంకలమర్రు (పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శ్రీకారం చుట్టారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా రూ.80 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఏలూరికి పూలమాలలు వేసి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. గ్రామ శివారులోని మహాప్రస్థానంలో కైలాసనాథుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, నీటి వసతి, డ్రైనేజ్, విద్యుత్ తదితర మెరుగైనా వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ప్రజలు సమష్టిగా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, షేక్. ఖాశీం, బంగారుబాబు, రావి శేషయ్య, రాఘవయ్య, మణికంఠ, శ్రీనివాసరావు, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంలో శనివారం మార్టూరు ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈవైద్య శిబిరంలో మొత్తం 300 మంది హాజరు కాగా అందులో 120 మందికి శస్త్ర చికిత్స అవరం అని వైద్యులు నిర్ధారించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవ చేయాలన్న సంకల్పంతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు స్వీకారం చుట్టడం జరిగిందన్నారు. లక్ష మంది నిరుపేదలకు కంటి చూపు అందించటమే తనముందున్న లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, సీనియర్ నాయకులు ఆదినారాయణ, రంగయ్య, తిరుముల శెట్టి శ్రీహరి, శంషుద్దీన్, సీతయ్య, తారక రామారావు, సాంబయ్య, సురేష్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

ఇంటర్ డ్రిస్టిక్ట్ టెన్నికాయింట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య


క్రీడల్లో రింగ్ విసురుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ క్రికెట్ క్రీడాకారిణి శ్రీచరణి స్ఫూర్తితో అందరు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ మైదానంలో 42వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి జూనియర్స్ బాలబాలికలు సుమారు 200 మంది హాజరయ్యారు. శని, ఆదివారం రెండురోజులు జరిగే ఈ పోటీలు స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదూర ప్రాంతాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపిన చిన్నారులను అభినందించారు. గత ప్రభుత్వం క్రీడలకు సంబంధించి నిలిపివేసిన ఇన్‌సెంటివ్‌లు కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు వివరించారు. క్రీడలను ప్రారంభించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో శాప్ డైరక్టర్ పేరం రవీంద్రనాథ్, సెక్రటరీ ఎన్వీ సత్యనారాయణ, కోశాధికారి కుంచే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.అలేఖ్య, జిల్లా కోశాధికారి కొల్లయ్య, దీప్తి, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికయుగంలో ప్రజలతో విడదీయరాని భాగంగా మీడియా

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో మీడియా మన జీవితంలో విడదీయరాని భాగంగా మారిందని సాహితీ కౌముది అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. సాహితీ కౌముది ఆధ్వర్యంలో శనివారం పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ టీవీ చానళ్లపై రాసిన పలు గ్రంథాలపై విశ్లేషణాత్మక పరిచయాలు జరిగాయి. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, గాడేపల్లి దివాకర్‌దత్, జాగర్లమూడి ప్రతాప్, పాలపర్తి జ్యోతిష్మతి, ఇలపావులూరి శేషతల్పసాయి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, నిమ్మరాజు నాగేశ్వరరావు, దేవపాలన తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కాంపిటేషన్లో కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్కిల్ కాంపిటేషన్లలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రిటైల్ ఒకేషనల్ ట్రేడింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ పోటీలు జిల్లా కేంద్రమైన బాపట్లలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సీహెచ్ పవన్ గోపీకృష్ణ సీహెచ్. హర్షవర్ధన్‌రాజు, ఎ.హర్షవర్ధన్, సీహెచ్. పూర్ణనాగచరణ్‌రాజులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన గంగాభవాని ప్రసాద్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎం.అనిత ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

రావిచెట్టు వీరాంజనేయస్వామికి విశేష పూజలు


లక్ష నాగవల్లీ దళార్చన పూజలు చేస్తున్న వేదపండితులు

పంగులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామంలో వేంచేసిన శ్రీరావిచెట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం వేదపండితులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి మహా మన్యుసూక్త అభిషేకం, లక్ష నాగవల్లీ దళార్చన పూజలు శాస్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరశింహరావు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ


ఎఫ్‌డీపీ పత్రాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎఫ్‌డీపీ (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్) సోమవారం నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమానికి కన్వీనర్ ప్రొఫెసర్ డా.ఇంద్రనీల్ శ్రీరామ్, కో కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డా.వీవీ.ప్రవీణ్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. శనివారం అందుకు సంబంధించిన పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

కారంచేడు (పర్చూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామానికి చెందిన విద్యార్థిని యార్లగడ్డ రాజ్యలక్ష్మి(23) అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తూ అనారోగ్యానికి గురై మృతి చెందిన ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతిపట్ల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్న వయస్సులోనే మృత్యువు ఆమెను కబళించటం బాధాకరమన్నారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం ఫోన్ ద్వారా పరామర్శించారు. అన్ని విధాలుగా సాయం అందిస్తామన్నారు. అమెరికా నుంచి ఆమె మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లి ఇలా మృత్యువాత పడడం దురదృష్టకరమన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

- పాపాయిపాలెంలో ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేసిన నేతలు


నగదు సాయం అందజేస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పాపాయిపాలెం(చీరాల), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బారినపడి నష్టపోయిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పలువురు కూటమి నేతలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తుఫాన్ బాధితులకు అందిస్తున్న రూ.3 వేల ఆర్థిక సాయం, బియ్యాన్ని శనివారం వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య బాధితుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పులి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, గవిని పోతురాజు, వీఆర్వో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

- మరో ఇద్దరు సురక్షితం
- ఇడుపులపాడులో ఘటన
- ఈత సరదాతో చెరువులో దిగిన ముగ్గురు యువకులు


సుమంత్ (ఫైల్)

ఇంకొల్లు, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : ఈత సరదాలో చెరువులో దిగిన ముగ్గురులో ఇద్దరు సురక్షితంగా బయటపడి ఒక యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇడుపులపాడులో శనివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన బండారు సుమంత్(16),కొర్నేలు,అనీల్ ఈతకు ఎస్సీకాలనీ సమీపంలోని చెరువులో దిగారు.బండారు సుమంత్ చెరువులో నుండి బయటకు రాలేక పోయారు.మిగిలిన ఇద్దరు బయటకు చేరుకొని విషయం స్థానికులకు తెలిపారు.సుమంత్ ఆచూకి తెలియకపోవడంతో సిఐ వై.వి రమణయ్య,ఎస్సై సురేష్,తహశీల్దారు శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చీరాల బోట్‌ను తెప్పించి చెరువులో గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమంత్ తండ్రి భూషయ్య పరుగు జిల్లాలో బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సుమంత్ చీరాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాత్రి 9 గంటల వరకు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సుమంత్ మృతదేహం ఆచూకి తెలియలేదు. చెరువు చుట్టూ సమీప బంధుమిత్రులు సుమంత్ మృతదేహం కోసం వేచి చూస్తున్నారు. అధికారులు సుమంత్ తల్లిదండ్రులకు సమాచారం అందిచారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇంకొల్లు, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామ పొలాల సమీపంలోని వాగు వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు శనివారం పోలీసులు గుర్తించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉంది. స్త్రీ లేదా పురుషుడా అనేది కూడా గుర్తించలేని విధంగా మృతదేహం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల నీటి ఉధృతికి కొట్టుకు వచ్చి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉన్నత పాఠశాల ఆటస్థలం అభివృద్ధికి రోటరీక్లబ్ చొరవ


మైదానాన్ని చదును చేస్తున్న రోటావేటర్

బల్లికురవ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బల్లికురవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం పెద్దఎత్తున గడ్డితో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు మార్టురు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు దృష్టికి తీసుకు వెళ్లారు. రోటరీ క్లబ్ తరపున శనివారం ట్రాక్టర్‌తో పాఠశాల ఆటస్థలంలో ఉన్న గడ్డిని దున్నించారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని రోటరీ ప్రదినిధులు తెలిపారు. ఆట స్థలంలోని రన్నింగ్ ట్రాక్‌ను కూడా సరిచేసి వాకింగ్‌కు ఉపయెగ పడేలా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రోటేరీయన్ గాలి గంగాధర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలను మా కాలనీకి రానివ్వం'


అనిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఆర్ కాలనీవాసులు

అద్దంకి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో అతి నిరుపేదలు ఎన్‌టీఆర్ నగర్‌లో నివాసం ఉంటు న్నారని, అలాంటి నిరుపేదలను ఖాళీ చేయించేందుకు వైసీపీ నేతలు కు ట్ర పన్నారని, అలాంటి వైసీపీ నేతలు కోటి సంతకాల పేరుతో తమ కాలనీకి వస్తే అడ్డుకుంటామని పలువురు తేల్చి చెప్పారు. వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కు తమ కాలనీకి రావద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలువురు కాలనీ వాసులు సంతకాలు చేసి టీడీపీ నాయకుడు కోనేటి అనిల్ కు అందజేశారు.


అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బల్లికురవ, నవంబరు 8 డ(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వంకం వీరాంజనేయులు(65) అను రైతు శనివారం పురుగుమందు తాగి అత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు వీరాంజనేయులు తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు గ్రామంలో మరి కొంత పొలాన్ని కౌలకు తీసుకుని సాగు చేశాడు. పొలంలో నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు రోజురోజుకు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందును తెచ్చుకొని ఇంట్లోనే తాగి అత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

వివరాలు 8లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వేదికపై ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, మరో మంత్రి నారాయణ, ఎంపీలు, వీపీఆర్, బీద మస్తాన్‌రావు, కలెక్టర్ తదితరులు

7.30 లక్షల ఎకరాలు...

73 టీఎంసీలు !

- రబీ సాగుకు నీటి కేటాయింపులు
- 15 నుంచి విడుదలకు ఐఏబీలో తీర్మానం
- ధాన్యం కొనుగోళ్లపై సుదీర్ఘ చర్చ
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం
- డీఆర్సీ సమావేశంలో మంత్రులు ఫరూక్, ఆనం, నారాయణ

నెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ రబీ సీజన్‌లో నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో సోమశిల, కండలేరు జలాశయాల కింద సుమారు 7.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు 73 టీఎంసీలను కేటాయిస్తూ తీర్మానించారు. ఈనెల 15 నుంచి నీటిని విడుదల చేయాలన్న ఇరిగేషన్ అధికారుల ప్రతిపాదనను ఐఏబీలో ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం జిల్లా అభివృద్ధి సమీక్ష(డీఆర్సీ) సమావేశం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో అంతర్భాగంగానే ఐఏబీని కూడా నిర్వహించారు. ఈ సమావేశాలకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

తొలుత డీఆర్సీలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖలు, హౌసింగ్, జాతీయ రహదారులు, రవాణాశాఖపై సమీక్షించారు. అనంతరం ఇరిగేషన్‌శాఖపై సమీక్ష సందర్భంగానే సాగునీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలు సమస్యలను ప్రస్తావించారు. సోమశిల కింద 5,04,552 ఎకరాలకు 50.40 టీఎంసీలు, కండలేరు జలాశయం కింద 2,23,333 ఎకరాలకు 22.33 టీఎంసీల నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఒక టీఎంసీతో 10 వేల ఎకరాలను పండించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. రాళ్లపాడు జలాశయానికి కూడా 1.50 టీఎంసీలను కేటాయించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ చక్రవర్తి, తూమాటి మాధవరావు, జేసీ ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు సీఎం దృష్టికి...

రాష్ట్రం మొత్తం రెండో పంట వేసినప్పుడు నెల్లూరులో మాత్రం మొదటి పంట ఉంటోందని, ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రం మొత్తం జరిగాక, జిల్లాలో వరికోతలు మొదలవుతుండడంతో రైతులకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. గత సీజన్లో కూడా ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారు చెప్పారు. ఇకపై జిల్లా రైతులకు అన్యాయం జరగకుండా నెల్లూరు జిల్లాలో ఎంత సాగు చేశారో.. ఆ దామాషా ప్రకారం ధాన్యం కొనుగోలు చేసేలా తీర్మానం చేయాలని కోరారు. ఈ విషయమై మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఇది చాలా ముఖ్యమైన సమస్య అని, ఈ అంశాన్ని కేబినెట్‌లో ప్రస్తావించడంతోపాటు సీఎం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. తుఫాన్ నష్టాలపై నివేదికలను ఈనెల 10న జరిగే కేబినెట్ దృష్టికి తీసుకెళతామని మంత్రి ఆనం తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కాగా జాతీయ రహదారుల అధికారుల పనితీరుపై మంత్రి ఆనంతోపాటు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

సాగునీటి కేటాయింపుల వివరాలు

ప్రాంతం పేరు	ఎకరాలు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2,15,552	21.55
కనుపూరు కాలువ	66,000	6.60.
కావలి కాలువ	1,00,000	10
ఉత్తర కాలువ	75,000	7.50
దక్షిణ కాలువ	48,000	4.80
కండలేరు లెఫ్ట్ కెనాల్	17,475	1.74
ఎస్ఎస్‌జీ(నెల్లూరు జిల్లా)	30,209	3.02
ఎస్ఎస్‌జీ(తిరుపతి జిల్లా)	1,75,649	17.56
మొత్తం	7,27,885	72.78

సర్వేపల్లి రిజర్వాయర్ తెగిపోతే పరిస్థితేమిటి..?



సర్వేపల్లి రిజర్వాయర్ ప్రమాదంలో ఉంది. కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఇవి తెగిపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. ఇక్కడ ఆధునికీకరణ పనులు చేపట్టాలి. కండలేరు స్పిల్‌వే వద్ద 50 వేల క్యూసెక్కులు విడుదల చేస్తే అనేక గ్రామాలు ముంపునకు గురవుతాయి. అక్కడ కాలువ నిర్మాణం జరగాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి



ప్రతీ సీజన్‌లోనూ వరిసాగు చేస్తే ధాన్యాన్ని మార్కెటింగ్ చేసుకోవడం కష్టంగా ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తే వారికి ఆదాయం వస్తుంది. మత్స్యకారులకు హైస్పీడ్ బోట్లను అందిస్తే పక్క రాష్ట్రాల చొరబాటుదారులను అడ్డుకునేందుకు వీలు కలుగుతుంది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

ఆక్వా రైతులకు సబ్సిడీ ఇవ్వాలి



ఆక్వా రైతుల్లో కొంతమందికే విద్యుత్ సబ్సిడీ అందుతోంది. ఈ సమస్యను పరిష్కరించి అందరికీ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయంలో డ్రోన్లు పంపిణీ చేసిన విధంగానే ఆక్వాలో కూడా డ్రోన్లు పంపిణీ చేస్తే మ్యాన్‌పవర్ సమస్యను తగ్గించుకోవచ్చు.

- బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యుడు

పశువుల దాణా ఇవ్వాలి



తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం పశువులకు దాణాను సరఫరా చేసింది. జిల్లాకు 430 టన్నులు వస్తే రూరల్ నియోజకవర్గంలో ఒక్క టన్ను కూడా పంపిణీ చేయలేదు. నేను జేడీకి ఫోన్ చేస్తే 3.50 టన్నులు ఇస్తామంటున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. కార్పొరేషన్ పరిధిలో కూడా పశువులు ఉన్నాయి. రూరల్‌ను ఒక మండలంగా కాకుండా నియోజకవర్గంగా చూడాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

'అన్నదాత సుఖీభవ'ను అందించండి



కోవూరు నియోజకవర్గంలో చాలామందికి అన్నదాత సుఖీభవ నగదు అందలేదు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరగా వారికి నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఆయకట్టు రైతులకు యూరియా ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అందరికీ యూరియా పంపిణీ చేసేలా చూడాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

చెరువులు, కాలువలను బాగు చేయాలి



అదృష్టవశాత్తూ ఈ ఏడాది ఉదయగిరి నియోజకవర్గంలో చెరువులు నిండాయి. కానీ ఆ నీటిని సరఫరా చేయడానికి కాలువలు సరిగా లేవు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కాలువలను బాగు చేయడంపై దృష్టి పెట్టాలి. గండిపాలెం రిజర్వాయర్‌కు ఇప్పటికీ హెడ్ ఆఫ్ అకౌంట్ లేదు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

సబ్సిడీతో విత్తనాలు అందించాలి



తుఫాన్ ప్రభావంతో కావలి నియోజకవర్గంలో చాలా చోట్ల నారుమళ్లు దెబ్బతిన్నాయి. అలాంటి రైతులను గుర్తించి సబ్సిడీతో విత్తనాలు అందించాలి. తుఫాన్ సమయంలో పశువులు చనిపోతే 30వ తేదీతో ఎన్యుమరేషన్ అయిపోయిందన్న కారణంతో రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు.

- దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

ఫిషరీస్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు..



ఫిషరీస్ బోట్లను రెన్యువల్ చేసే విషయంలో మత్స్యకారులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ ఎఫ్‌డీవో బెదిరిస్తున్నారని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.ఈ సమస్యపై కలెక్టర్ దృష్టి పెట్టాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

కొలువుల కౌశలం

- జిల్లాలో 1.28 లక్షలమంది నిరుద్యోగుల గుర్తింపు
- వారున్న చోటే ఉద్యోగాలు
- ఎంపిక కోసం నైపుణ్య పరీక్ష
- రేపు మోడల్ టెస్ట్ నిర్వహణ



నిరుద్యోగిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం 'కౌశలం- వర్క్ ఫ్రం హోం' అనే పథకాన్ని అమలు చేస్తున్నది. విద్యార్హతల ఆధారంగా వారున్నచోటే ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ పథకం ఉపయోగపడనున్నది. జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులను గుర్తింపునకు సర్వే జరిగింది. గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ సర్వే చేశారు. 18ఏళ్ల పైబడిన వారి నుంచి వివరాలు సేకరించారు. పదోతరగతి, ఆపై చదువులు చదివినవారి వివరాలను నమోదు చేశారు. ఏ ఉద్యోగం చేయగలరనే ఆసక్తిని కూడా కనుక్కున్నారు. అనంతరం వారి సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు.కాగా నిరుద్యోగులే స్వయంగా ఉద్యోగ అవకాశాల కోసం వారి వివరాలను నమోదు చేసుకోనే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. సచివాలయ ఉద్యోగులతో సంబంధం లేకుండా నేరుగా కౌశలం వెబ్‌సైట్‌లో వారు తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు.

• వృత్తి నైపుణ్య శిక్షణ

విద్యార్హత ఆధారంగా నిరుద్యోగులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి, అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకాలంలో వారికి కొంతమొత్తాన్ని ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, బీటెక్, డిప్లమో, ఐటీఐ చదివిన నిరుద్యోగులకు ప్రాథమికంగా నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభను గుర్తించి, తగిన ఉద్యోగావకాశాలను అన్వేషిస్తారు. ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తారు. వారు ఇంటివద్దే ఉద్యోగం చేసేలా చర్యలు చేపడతారు.

• జిల్లాలో 1.28 లక్షలమంది...

ఈఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలో తొలివిడత కౌశలం సర్వే జరిగింది. రెండో విడత జూలైలో ప్రారంభమై తాజాగా జరుగుతోంది. తొలి విడత సర్వేలో జిల్లాలో 1.28 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు గుర్తించారు. వారు నోటిమాటగా చెప్పారా, నిజంగా చెప్పారా? అనే అంశమై రెండో విడత సర్వే ప్రారంభమైంది. తొలి విడతలో గుర్తించిన 1.28లక్షల మంది సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నారు. రెండో విడతలో 90187 మంది వివరాలను సంపూర్ణంగా నమోదు చేశారు. రెండో విడతలో 70.44 శాతం సర్వేపూర్తయింది.

• రేపు నమూనా పరీక్ష

నిరుద్యోగులకు నైపుణ్య పరీక్ష నిర్వహించడానికి ప్రతీ సచివాలయానికి వెబ్‌కెమరాను, హెడ్‌ఫోన్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని పరీక్షించడానికి నమూనా నైపుణ్య పరీక్షను నిర్వహించనుంది. సోమవారం (రేపు) సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులతో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి నిరుద్యోగులకు నైపుణ్య పరీక్షను నిర్వహించనున్నారు.

సోమశిలకు 18,182 క్యూసెక్కుల నీరు

అనంతసాగరం నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 18,182 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్యాంలో 71.851 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

• కండలేరులో 58.51 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 58.51 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 640 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.11,85,751

వలేటివారిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.11,85,751 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ.10,700, కుంకుమార్చనకు రూ.18,320, వివాహాల ద్వారా రూ.2 వేలు, తలనీలాల ద్వారా రూ.4,30,450, వాహన పూజలకు రూ.3,580, ప్రత్యేకదర్శనం టిక్కెట్లకు రూ. 4,03,700, రూము అద్దెలు రూ. 35,990, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,16,845, అన్నదానానికి రూ.4,39,120 ఆదాయం లభించినట్లు తెలిపారు.

రేపటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా నిర్వహణకు ఏర్పాట్లు
- 25 నాటికి మూల్యాంకనం పూర్తి
- 30న ప్రోగ్రస్ కార్డుల జారీ



నెల్లూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ యాజమాన్య పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1(ఎస్ఏ-1) పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఈనెల 19 వరకు ఈ పరీక్షలను నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను, మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆయా తేదీల్లో ఉదయం 8, 9, 10 తరగతులకు, మధ్యాహ్నం 6, 7 తరగతులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లిష్, 13న గణితం, 14న జనరల్ సైన్స్-ఫిజికల్ సైన్స్, 15న బయలాజికల్ సైన్స్, 17న సోషల్ స్టడీస్, పరీక్షలు, ఓరియంటల్ పాఠశాలలకు చెందిన పరీక్షలు 18, 19వతేదీల్లో నిర్వహించనున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 11న తెలుగు, 12న ఇంగ్లిష్, 13న గణితం, 14న ఈవీఎస్ పరీక్షలను ప్రతిరోజూ ఉదయం పూట నిర్వహిస్తారు. 10వతరగతికి 100 మార్కులకు, ఇతర తరగతులకు 80 మార్కులకు జరిగే ఈ పరీక్షలకు అక్టోబరు వరకు జరిగిన సిలబస్‌పై ప్రశ్నలుంటాయని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీ రావు తెలిపారు.

• కట్టుదిట్టంగా నిర్వహణ

ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో తెలిపారు. 1 నుంచి 5వతరగతి ప్రశ్నపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్‌లలో, 6 నుంచి 10వతరగతి వరకు ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలలో భద్రపరుస్తారన్నారు. వీటి పంపిణీ కోసం ఎమ్మార్సీ స్థాయిలో ఎంఈవో-1, ఎంఈవో-2, ఒక ప్రధానోపాధ్యాయుడితోపాటు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామన్నారు. క్లస్టర్‌స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్, ఒక రిసోర్స్ పర్సన్‌తో కమిటీ పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రతి సెషన్ ప్రారంభానికి గంట ముందుగా మాత్రమే ప్రశ్నపత్రాలు పాఠశాలలకు అందచేస్తారన్నారు. సమాధాన మూల్యాంకనం నవంబరు 25 నాటికి పూర్తి చేసి మార్కులను లీప్‌యాప్‌లో నమోదు చేయాలని డీఈవో తెలిపారు. నవంబరు 30 నాటికి ప్రోగ్రస్ కార్డులను జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600

పాఠశాలకు 20 ఫ్యాన్ల వితరణ

కొండాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు స్పిరిట్ ఆఫ్ కేడీపీ సభ్యులు శనివారం 20 ఫ్యాన్లు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కొందరు స్పిరిట్ ఆఫ్ కేడీపీ గ్రూపుగా ఏర్పడి దాదాపు రూ.45 వేల విలువగల ఫ్యాన్లు సమకూర్చగా సభ్యుడు నర్రా శివన్నారాయణ ప్రధానోపాధ్యాయుడు వీ.రాధాక్రిష్ణకు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందచేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ లక్షణ వారికి ధన్యవాదాలు తెలిపారు.



దుస్థితిలో టిడ్కో గృహాలు!

- వర్షం వస్తే గృహ సముదాయం చెరువే..
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



టిడ్కో సముదాయంలో తోలిన కంపోస్టు మట్టి

కావలి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులో గత టీడీపీ ప్రభుత్వంలో పేదల ఆవాసాల కోసం నిర్మించిన టిడ్కో గృహాల సముదాయం సమస్యల వలయంగా మారింది. మొంథా తుపానుకు చెరువును తలపించింది. వర్షపు నీరు టిడ్కో గృహాల సముదాయంలోకి చేరడంతో 5 అడుగుల మేర నిల్వ చేరింది. టిడ్కో సముదాయంలో సుమారు 2,200 గృహాలు ఉన్నప్పటికీ అక్కడ ప్రభుత్వం పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో చాలా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 600 కుటుంబాలు ఈ గృహాల్లో నివసిస్తున్నారు. ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. ఒక వైపు చెరువు.. రెండు వైపులా పొలాలు ఉండటం వల్ల చెట్లలో నుంచి సర్పాలు, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వీధి లైట్లు పూర్తి స్థాయిలో వెలగకపోవటంతో అపరిచిత వ్యక్తులు, దొంగలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సివస్తోంది. చెరువుల్లో మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటూ టిడ్కో గృహ సముదాయంలోని ఖాళీ ప్రదేశాలకు ఇటీవల డంపింగ్ యార్డులోని కంపోస్టు మట్టిని తోలారు. దీంతో వర్షాలకు ఐదు అడుగుల మేర వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిల్వ చేరడంతో మడుగును తలపించింది. దీంతో తాము ఇళ్లనుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. కంపోస్టు మట్టిలో కలిసి వర్షపు నీరు తాగునీటి బావిలోకి చేరటంతో తాగునీరు కలుషితమై వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు తూర్పు వైపు ఆనెమడుగు చెరువు ఉండటంతో లోతట్టున ఉన్న నివాస సముదాయంలోకి వర్షపు నీరు వచ్చేయడంతో జలవలయంగా మారింది.



గృహ సముదాయం చుట్టూ ఉన్న కంపచెట్లు

● పరిశీలన సరే.. పరిష్కారమేదీ..?

భారీ వర్షాలతో ముంపునకు గురైన టిడ్కో గృహాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ, సీపీఎం నేతలు, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌లు పరిశీలించారు. సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ తమ సమస్యలు పరిష్కరించలేదని స్థానికులు వాపోతున్నారు.

రాత్రయితే దొంగల భయం



వీధి లైట్లు ఒక్కటి కూడా వెలగడం లేదు. దీంతో పాటు దొంగల భయం ఎక్కువైంది. ఇక్కడ వాచ్‌మెన్ కూడా లేదు. బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నాం. మా ఇంట్లో దొంగలు పడి సెల్ ఫోన్, నగదు ఎత్తుకెళ్లారు. వాచ్‌మెన్‌ను నియమించి, రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయాలి.

- అన్నం పొట్టెమ్మ

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లతో నీటిని తొలిగింపునకు చర్యలు చేపట్టారు. అయితే అధికారులు, పాలకులు పూర్తిస్థాయిలో స్పందించడం లేదు. వెంటనే ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి. భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ఉన్నప్పటికీ మీటర్ల వరకు వర్షపు నీరు చేరింది. దీంతో రెండు రోజులుగా చీకట్లో ఉన్నాం. విద్యుత్ సరఫరా సరిగా లేక ఇబ్బందిపడుతున్నాం.

- కీలు శ్యామ్

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి



గృహ సమదాయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టక పోవటంతో పక్కనున్న చెరువులోని నీరు మొత్తం ఇళ్లలోకి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. అందుకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించాలి.

- చవల రమేష్ చంద్ర

బ్రిడ్జి సెంటర్‌లో నిత్యం స్తంభిస్తున్న ట్రాఫిక్!



బ్రిడ్జి సెంటర్‌లో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులు, వాహన చోదకులు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రంకురోడ్డులోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయగిరి రోడ్డులో వంతెనపైకి రాకపోకలు సాగించే బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు, దించేందుకు వంతెన దిగువ భాగాన నిలపాల్సి ఉంది. దీంతో ఆ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్‌రోడ్లు ఆక్రమణలకు గురి కావటంతో అక్కడ వాహనాలు స్టాపింగ్‌కు ఇబ్బందికరంగా మారింది. ఆక్రమణలను తొలగించటంలో మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటంతో అవి పెచ్చుమీరి పోయాయి. అలాగే అక్కడ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నా పోలీసు అధికారులు గాలికొదిలేయటంతో ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. కొన్ని సందర్భాలలో వంతెనపై నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఒకేసారి మూడు నాలుగు వచ్చి అక్కడ ఆగుతుండటంతో ఆ సమయంలో ట్రాఫిక్ మరింత ఇబ్బంది కరంగా మారుతోంది. మున్సిపల్ అధికారులు, పోలీస్‌లు స్పందించి అప్రోచ్ రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని, బస్సులు ఆగే చోట ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకపోవడం అన్యాయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడి చేసిన వారిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై చెప్పుతో దాడి చేసిన రాకేష్ శర్మను బీజేపీ ప్రభుత్వం కాపాడడం భారత ప్రజలకు అవమానకరమన్నారు. చట్టం తనపని తాను చేసుకుని పోతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెపుతూ అరెస్ట్‌కు అడ్డుపడటం చూస్తే దళితులను అవమానించటమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దాడిని ఖండించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా దాడి చేసిన రాకేష్‌శర్మను అరెస్ట్ చేసి న్యాయమూర్తులకు న్యాయం జరుగుతోందని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నరసింహారావు, జరుగుమల్లి విజయరత్నం, శ్రీను, జెడ్డా వాసు, బాలక్రిష్ణ, రమణయ్య, సతీష్ లు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం



సిద్ధేశ్వరస్వామి

కలిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు కొండపై వెలసియున్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు విశేష పూజా కార్యక్రమాలతోపాటు శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వైభవంగా జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు తీర్థప్రసాదాలు, అన్నదానమును స్వీకరించాలని గ్రామపెద్దలు కోరారు.

102వ నేత్రదానం

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు గ్రామానికి చెందిన డీ. పాపిరెడ్డి(49) గుండెపోటుతో హఠాన్మరణం చెందగా ఆయన కుటుంబసభ్యులు సేవాభావంతో ముందుకొచ్చి నేత్రాలను దానం చేశారు. సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు సహకారంతో నేత్రదానం చేయాలన్న తమ ఆకాంక్షను వ్యక్తం చేయగా ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల రీసెర్చ్ సెంటర్ నేత్రసేకరణ నిపుణులు వచ్చి పాపిరెడ్డి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతంలో ఇది 102వ నేత్రదానమని, గ్రామీణ ప్రాంతాలలో కూడా నేత్రదానం పట్ల అవగాహన పెరిగిందనేందుకు పాపిరెడ్డి కుటుంబసభ్యులే నిదర్శనమన్నారు. పాపిరెడ్డి చనిపోయాక కూడా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశాన్ని ఆయన కుటుంబసభ్యులు కల్పించారని అభినందించారు.

రోడ్డుపైకి మురుగు నీరు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెదపవని బస్టాండ్ సెంటర్‌లోని రోడ్డుపై చేరిన మురుగు నీరు

లింగసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని బస్టాండ్ సెంటర్‌లోని రోడ్డుపై కొందరు వ్యక్తులు మురికి నీటిని వదులుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లోని మెయిన్ సెంటరు నుంచి మసీదు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొందరు హోటళ్ల నిర్వాహకులు, గృహాలకు చెందిన వారు తమ ఇళ్లు, హోటళ్లలోని వ్యర్థాలను, మురుగు నీటిని ప్రతి రోజూ రాత్రి సమయంలో రోడ్డుపై వదులుతున్నారు. దీంతో గ్రామస్థులు ఈ రోడ్డుపై నడవాలన్నా, వాహనదారులు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక ఈ మురుగు నీరు దోమలకు ఆవాసంగా మారి ప్రజలపై దండయాత్ర చేస్తుండడంతో ఎక్కడ వ్యాధులు సంభవిస్తాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు కరేడు విద్యార్థినుల ఎంపిక



జ్ఞాపిక అందుకున్న కరేడు విద్యార్థినులు

ఉలవపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెయింట్ జాన్ పాఠశాలలో జరిగిన పీఎంశ్రీ స్కూల్స్‌కు సంబంధించి వృత్తి విద్యాకోర్సుల ప్రదర్శనల పోటీల్లో హెల్త్‌కేర్ విభాగంలో కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నలుగురు మొదటి స్థానం సాధించారు.వీరిలో పాకల వెంకటవరలక్ష్మి, నాదెండ్ల గాయత్రి, మాచవరం జస్మిత, బాపనపల్లి అమూల్యలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ బాలేశ్వరరావు తెలిపారు. వీరిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది. తల్లిదండ్రులు అభినందించారు.

పశుపోషకులకు అవగాహన ఉండాలి



పశువులకు సూడి పరీక్షలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు

కావలిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులు సూడి పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ వీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండ లంలోని గౌరవరం పశువైద్యశాలలో శనివారం పశువులకు నిర్వహించే సూడి పరీక్షలపై పశు పోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు వ్యాపించే పచ్చిక దొమ్మ వ్యాధి నివారణకు టీకాలు వెయ్యటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం పశువులకు సూడి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలకొండారెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కలిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కావలి-కలిగిరి మార్గంలో పెద్దపాడు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట క్రిష్ణారెడ్డి పరామర్శించారు. వారి స్వగ్రామంలో మనోజ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందచేశారు. మనోజ్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పోలు కొండలరావు, జిర్రా పెద్ద అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పంచాయతీ కార్యదర్శుల కొరత!

- సేవలందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం గ్రామ సచివాలయం

వలేటివారిపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. దీంతో ఆయా పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. ఆ పంచాయతీల్లో సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా అయ్యవారిపల్లె, చుండి, బడేవారిపాలెం, శాఖవరం, శామీరపాలెం, కళ్లవళ్ల పోలినేనిపాలెం, నేకునాంపురం గ్రామ పంచాయతీలకు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఉండాల్సి ఉండగా 21 గ్రామ పంచాయతీలకు 8 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో కార్యదర్శి 2, 3 పంచాయతీ బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఒక్కడ ఉన్న పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో నియమితులైన పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరకుండానే అధికారపార్టీ నాయకుల సిఫార్సు మేరకు వాళ్లకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. దీంతో మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఏర్పడింది. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు లేక పనులు సకాలంలో కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వెళ్లితే పంచాయతీ కార్యదర్శులు లేరని చెప్తుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నామని పలువురు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు నియామకంలో ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులను నియమించి సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక చట్టాలు ఉల్లంఘించడం సరికాదు

- ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చేందుకు మంత్రి మండలి తీర్మానం చేయడం దారుణమని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.సుందరరామరాజు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ ఈ నెల 23, 24వ తేదీలలో విశాఖలో నిర్వహించే రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సుందరరామరాజు మాట్లాడుతూ ఏఐఎఫ్‌బీ పార్టీ ప్లీనరీ సమావేశాలు విశాఖపట్టణంలోని కుర్మనపాలెం ఆవాస్‌ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలలో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు గతంలో ఉన్న 8 గంటల పని విధానాలను 10 గంటలకు పెంచుతూ మంత్రి మండలి తీర్మానం చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. కార్మిక చట్టాలను పాలిష్ చేసి వాటికి వ్యతిరేకమైన పద్ధతులు అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా అధికారంలో, ప్రతిపక్షంలో ఉండి కార్మికులపై ఈ విధానాన్ని బలవంతంగా రుద్దుతున్నాయన్నారు. జీఎస్టీ ధరలు పెంచి ఇప్పుడు తగ్గించామని ఉత్సవాలు జరుపుకోవడం సరికాదన్నారు. జిల్లాలో కరేడు భూముల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టీ.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, టీయూసీసీ జిల్లా కన్వీనర్ కావలి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా.. గట్టెక్కేనా?

- నిండుకుండల్లా సోమశిల, కండలేరు
- భారీ వర్షాలకు నిండిన చెరువులు
- రబీ సాగుకు రైతుల సమాయత్తం



నిండుకుండలా ఉన్న కండలేరు జలాశయం

పొదలకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సాగునీటికి ఢోకా లేకున్నా రైతుల్లో రబీ సాగుపై అనేక సందేహాలున్నాయి. పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో దిగుబడిని పెంపొందించు కునేందుకు నూతన వరి వంగడాల కోసం కసరత్తు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఉన్న బంధువుల ద్వారా కూడా సమాచారం సేకరించి విత్తన ఎంపికపై ఆరా తీస్తున్నారు. ఎకరాకు 4 నుంచి 5పుట్ల ధాన్యం దిగుబడి అయితేనే పెట్టుబడులు తిరిగి దక్కించు కోగలమనే భావనలో ఉన్నారు. ఎడగారులో వరిసాగు చేసిన రైతులు ధరల్లేక నష్టపోయారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 2.5 పుట్లు కూడా దిగుబడి కాలేదు. గ్రామాల్లో వరి నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కేఎన్ఎం 1688, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ నేపథ్యంలోనే విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేఎన్ఎం 7715 రకాన్ని సేకరించేందుకు మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం తదితర పెన్నార్ డెల్టా ప్రాంతాల రైతులు తిగుతున్నారు. అలాగే కేఎన్ఎం 12510 గురించి కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ రకం విత్తనాలు దిగుబడి అధికంగా ఉంటుందని, అయితే సాధారణ రకం కంటే 20రోజులు ఆలస్యంగా కోతలకు వస్తుం దంటున్నారు. ఎకరానికి 4.5 నుంచి 5 పుట్ల ధాన్యం దిగుబడి అవుతుందనే ప్రచారం ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

● యూరియా కార్డుల పంపిణీ

మండలంలోని 10వేల యూరియా కార్డులను అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్నీ రైతు సేవా కేంద్రాలకు యూరియాను దిగుబడి చేసుకున్నా మని, మొదటి కోటా కింద బస్తాలను అందజేస్తామని అంటున్నారు. అయితే చాలా మంది రైతులు తీరవజాస్తి ఆయకట్టు కింద రబీలో వరిసాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగి యూరియా లభ్యం కాక సమస్యలు ఎదుర్కొనే కంటే సాగు చేయకపోవడమే మేలనే ఆలోచనలో ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో బస్తా యూరియా రూ.400 చెల్లించినా లభ్యం కావడంలేదని వాపోతున్నారు. రబీలో మండలంలో 18 వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న బ్రహ్మారెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు

రాపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి సిద్ధవరం గ్రామ వాస్తవ్యులు ఏటూరి బ్రహ్మారెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు రూ.1 లక్షా 116 విరాళం అందించారు. దాతలకు మూడు ఆలయాలలో ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాటు చేసి శ్రీవార్ల దర్శనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ఇద్దరు సచివాలయ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు(సిటీ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జారీ చేసిన షోకాజు నోటీసుకు సంతృప్తికరమైన వివరణ ఇవ్వనందున ఇద్దరు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ నెల్లూరు నగర కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 45వ డివిజన్ రామ్మూర్తినగర్ 2వ సచివాలయంలో శానిటేషన్ కార్యదర్శిగా ఉన్న టీ శోభనను సస్పెండ్ చేసి ఆమె స్థానంలో 1వ సచివాలయం శానిటేషన్ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే 27వ డివిజన్ లక్ష్మీసాయి నగర్ సచివాలయం శానిటేషన్ కార్యదర్శి ఎన్ ధనుంజయ్‌ను సస్పెండ్ చేసి ఆయన స్థానంలో 2వ సచివాలయంలోని శానిటేషన్ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఖాదర్‌బాషా ఎంపిక



వింజమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉదయగిరికి చెందిన ఖాదర్‌బాషా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రతీ ఏటా నవంబరు 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఈ అవార్డులతో సత్కరిస్తుంది. నవంబరు 11న విజయవాడలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ సభలో ఖాదరబాషా ఈ అవార్డును అందుకోనున్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో విజయకుమార్, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ శంకరన్ హాల్లో శనివారం కనదాసు జయంత్యుత్సవాన్ని ఘనంగా జరిగింది. కనకదాస చిత్రపటానికి డీఆర్వో విజయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కర్ణాటకలోని హావేరి జిల్లా బాడ గ్రామంలో జన్మించిన కనకదాస శ్రీకృష్ణుని భక్తుడని, ఆధునిక కవి, తత్వవేత్త, స్వరకర్త అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి పీ వెంకట లక్ష్మమ్మ, సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి



ప్రసాదు(ఫైల్)

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వేగనియంత్రణ కోసం 167బీ జాతీయ రహదారిపై పలుకూరు వద్ద ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పట్టణంలోని కోవూరు రోడ్డులో నివాసం ఉండే ప్రసాదు(40) ఈనెల 6న మోటారుసైకిల్‌పై సింగరాయకొండ నుంచి కందుకూరుకు వస్తూ పలుకూరు వద్ద డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యచికిత్స నిమిత్తం ఆయనను గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడి డాక్టర్లు బ్రతికే అవకాశం లేదని చెప్పటంతో కందుకూరుకు తీసుకుని రాగా శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా జాతీయ రహదారిపై వేగనియంత్రణకు ఇనుప బారికేడ్లు లాంటివి ఏర్పాటు చేయాలి తప్ప ఇనుప డ్రమ్ములు పెట్టడం వల్ల అవి దగ్గరకు వచ్చేవరకు కనిపించటం లేదని, దీంతో వాటిని ఢీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు.

రవాణా చార్జీలు ఎప్పుడిస్తారు..?

- విద్యార్థుల ఎదురుచూపులు
- గతంలో విద్యా సంవత్సరం చివర్లో అందజేత
- ఈ ప్రభుత్వంలో 3నెలలకొకసారంటూ హామీ
- ఆరునెలలైనా విడుదలకాని వైనం

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి దూరప్రాంతాల నుంచి వచ్చేందుకు ఇచ్చే రవాణా చార్జీల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పాఠశాలలు దూరం ఉన్నాయి. అలాంటి చోట్ల విద్యార్థులు అందుబాటులో ఉంటే బస్సులు.. లేకపోతే ఆటోలు, ఇతర వాహనాల్లో పాఠశాలలకు వెళ్తున్నారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారింది. ఈక్రమంలో ఈ ఏడాది నుంచి మూడు నెలలకొకసారి విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

● రవాణా చార్జీలు తప్పనిసరి

జిల్లా వ్యాప్తంగా 2,571 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 56 వేలమంది వరకు చదువుకుంటున్నారు. సాధారణంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు పాఠశాలలు నిర్ణీత దూరంలో లేని పక్షంలో వారికి తప్పనసరిగా రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలి. ఈ చార్జీలను కేంద్ర ప్రభుత్వం 60శాతం భరిస్తే, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాల ఇంటి నుంచి కిలోమీటరు కంటే ఎక్కువ దూ రంలో ఉన్నా.. ఆరు నుంచి ఎనమిదో తరగతుల పాఠశాలల విద్యార్థుల ఇళ్ల నుంచి మూడు కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా.... ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 600 వంతున చెల్లించాలి. గతంలో విద్యార్థులకు ఈ రవాణా చార్జీలను విద్యా సంవత్సరం చి వరిలో చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి మూడు నెలలకొకసారి చెల్లిస్తే తల్లిదండ్రు ల కు వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం భావించి, ఆ మేరకు హామీ ఇచ్చింది.

● 12,951 మంది విద్యార్థులకు లబ్ధి

విద్యాశాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 12,951 మంది విద్యార్థులు ఉన్నారు. రవాణా చార్జీల కింద వీరందరికి లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు వీరి రవాణా చార్జీలను విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా ప్రభుత్వం ప్రకటించింది.

● ఎదురుచూపులు

రవాణా చార్జీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. పాఠశాలలు తెరిచి ఇప్పటికే ఆరో నెల గడుస్తుంది. మూడునెలలకొకసారి లెక్కన ఆగస్టులో మొదటి విడత చార్జీలు జమ చేయాలి. ఇంకా జమ కాలేదు. ఈ నెలలో రెండో విడత వేయాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల రవాణా చార్జీలను విడుదల చేయాలి.



పెరమన గ్రామం నుంచి సంగం హైస్కూలుకు ఆటోలో వస్తున్న విద్యార్థులు

శబరిగిరి యాత్రకు మరో 18 రైళ్లు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), (ఆంధ్రజ్యోతి) : శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే మరో 18 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే జిల్లా మీదుగా దాదాపు 50 ప్రత్యేక రైళ్లను వేసిన విషయం విదితమే. తాజాగా మరో 18 వేస్తున్నట్లు తెలిపింది.

ఇద్దరు దొంగల అరెస్టు : 80 గ్రాముల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, పక్కన సీఐ అన్వర్‌బాషా

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉలవపాడు వడ్డెపాలెంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. శనివారం కందుకూరు సీఐ అన్వర్‌బాషా, ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ దొంగతనం, రికవరీ వివరాలను తెలిపారు. జిల్లాలోని విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన మడపర్తి సతీష్, మోర్ల శివప్రసాద్, బొట్టు చంద్రశేఖర్‌లు ఈ దొంగతనానికి పాల్పడ్డారని, వారిలో సతీష్‌పై వివిధ పోలీసు స్టేషన్లలో 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఉలవపాడు వడ్డెపాలెంలో నివసిస్తున్న పాకల అరుణ ఇంట్లో జరిగిన దొంగతనంలో 90 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు అప్పట్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని, ఈకేసులో నేరస్థులుగా గుర్తించిన సతీష్, శివప్రసాద్‌లను ప్రస్తుతం అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాములు రికవరీ చేశామని తెలిపారు. చంద్రశేఖర్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో సీఐ అన్వర్‌బాషా, ఎస్‌ఐ అంకమ్మ, ఉలవపాడు పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు సీసీఎస్ సీఐ బీ.అశోక్‌కుమార్, సీసీఎస్ స్టేషన్ సిబ్బంది చాకచక్యంగా దర్యాప్తు చేసి దొంగలను రాజుపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారని వివరించారు. దొంగతనం కేసు దర్యాప్తులో మంచి పురోగతి సాధించటంలో క్రియాశీలంగా పనిచేసిన ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ, స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారని డీఎస్పీ తెలిపారు. రికవరీ సొత్తును, దొంగలను కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

మరో తిరుమలగా బిలకూట క్షేత్రం : మంత్రి ఆనం

బిట్రగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం ప్రసన్న వేంకటేశ్వరస్వామి వెలసిన బిలకూట క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బోగోలు మండలం కొండబిట్రగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పలు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి సేవలు చేసుకునే భాగ్యం తనకు దొరికిందన్నారు. ఆలయానికి మహాప్రాకారం, రథశాల, వేదపాఠశాల, తూర్పు వైపున గాలిగోపురం పనులు పూర్తి చేసుకుంటే శోభాయమానంగా ఉంటుందని చెప్పారు. బిలకూట క్షేత్రం తిరుమల అంతటి పుణ్యక్షేత్రం కావాలని, ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ దిగువ ప్రాంతంలో రూ. 2కోట్లతో ధ్యాన మందిరం, రూ.23 లక్షలతో రథశాల, రూ.2 కోట్లతో కల్యాణ మండపం, రూ. 35 లక్షలతో కల్యాణకట్ట, రూ. 2లక్షలతో గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ట చేపట్టనున్నట్లు ఆనం వివరించారు. అలాగే తూర్పు గాలిగోపురం, రాతి మెట్లు, గోశాల నిర్మాణాలు జరుగుతాయని వివరించారు. దాతలంతా సహకరిస్తే పనులు త్వరగా పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జనసేన నేత అలహరి సుధాకర్, కావలి డీఎస్పీ శ్రీధర్, కావలి రూరల్ సీఐ పాపారావు, బీజేపీ నేత కే.బ్రహ్మానందం, టీడీపీ నేత ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, తదితరులు

ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

● వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ ఛాంపియన్లుగా కావలి జేబీ

కావలి(టౌన్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్‌యు పీజీ కళాశాలలో జరుగుతున్న విక్రమ సింహపురి యూనివర్శిటీ మహిళల అంతర్ కళాశాలల క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వాలీబాల్, హ్యాండ్ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ఫైనల్ పోటీలను జేబీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి ప్రారంభించారు. వాలీబాల్ విన్నర్‌గా కావలి జేబీ, రన్నర్‌గా నెల్లూరు అలెక్సా, బాల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా అలెక్సా, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా అలెక్సా, ఖోఖో విన్నర్‌గా డీకేడబ్ల్యూ నెల్లూరు, రన్నర్‌గా జేబీ, చెస్ విన్నర్‌గా కావలి శ్రీచైతన్య, రన్నర్‌గా డాక్టర్ ఎస్ ఆర్‌జీ ఆత్మకూరు, టెన్నిస్ సింగిల్స్ విన్నర్‌గా వీఎస్‌యు నెల్లూరు, రన్నర్‌గా జేబీ, డబుల్స్ విన్నర్‌గా కావలి శ్రీసాయి, రన్నర్‌గా జేబీ జట్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల పీడీ మణికంఠ, అమ్మాజీ, జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి, సీనియర్ పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, వీఎస్‌యూ పీడీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఫైనల్స్‌లో పోటీపడుతున్న జేబీ, అలెక్సా కళాశాలల జట్లు

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

మర్రిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి వనం చెన్నకృష్ణయ్య(65) ఆత్మహత్య పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కుంటనిళ్లపాడులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కుటంబంలో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో మనస్థాపంతో తన ఇంట్లో ఉన్న పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటీన బద్వేలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. దీంతో పోలీసు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కలువాయి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపూరుపల్లి రామాలయం, వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థుల సమాచారం మేరకు... కనుపూరుపల్లి రామాలయంలో శుక్రవారం రాత్రి తలుపులు పగలగొట్టి గర్భగుడిలో ఉన్న అమ్మవారి తాళిబొట్లు, హుండీ ఎత్తుకెళ్లారు. వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయంలో అమ్మవారి కళ్లకు అలంకరించే వెండి వస్తువులతో పాటు హుండీని తీసుకెళ్లారు. సంఘటనా స్థలాలను ఎస్‌ఐ కోటయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె లలిత

కావలిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచం పట్టిన తల్లి దేవబత్తిన భ్రమరాంబ(79) మృతి చెందగా ఆమెకు తన కుమార్తె తలకొరివి పెట్టి దహన సంస్కారాలు చేసిన ఘటన శనివారం కావలి మం డలం చౌదరిపాళెంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చౌదరిపాళెంకు చెందిన దేవబత్తిన పేరయ్య, భ్రమరాంబ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ కుమారులు లేరన్న బెంగను వదిలి ముగ్గురు కుమార్తెలకు విద్యాబుద్ధులు నేర్పి వివాహాలు చేశారు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న తల్లి మృతి చెందడంతో కుమార్తెలు పుట్టింటికి చేరారు. ఒంగోలులో ఉంటున్న ఆమె చిన్నకుమార్తె నల్లూరి లలిత తల్లికి తలకొరివి పెట్టి దహనసంస్కారాలు చేసి ఆ తల్లికి కుమారుడు లేని లోటును తీర్చి ఆదర్శంగా నిలిచింది.

అకారణంగా ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అకారణంగా ఓ వ్యక్తి మీద దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట గొర్రెలమిట్ట ప్రాంతంలో పెయింటర్ ఎస్‌కే ఖాదర్‌బాషా నివసిస్తున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం. గురువారం రాత్రి ఆయన పరమేశ్వరినగర్ సమీపంలోని మద్యం దుకాణంలో చాంద్‌బాషా, గౌస్‌బాషా అనే వ్యక్తులతో మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారితో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. ఏమి లేదని చెప్పడంతో వెళ్లిపోయిన ఆ వ్యక్తి కొద్ది సేపటి తర్వాత మరలా వచ్చి ఖాదర్‌బాషాపై దాడి చేశాడు. అంతటితో ఆగక రాయితో ఖాదర్‌పై దాడి చేశాడు. తలకు గాయమైన ఖాదర్‌బాషా జీజీహెచ్‌లో చేరి శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డు పక్కన నిలిపి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో శుక్రవారం అర్ధరాత్రి సౌత్,నార్త్ ట్రాఫిక్ పోలీసులు తనఖీలు చేపట్టారు. ట్రావెల్స్ బస్సులకు పర్మిట్, ఎఫ్‌సీ, ఫైర్, ఎగ్జిట్ డోర్ వద్ద సీట్ల ఏర్పాటు... ఇలా అనేక అంశాలను పరిశీలించారు. ప్రధానంగా డ్రైవర్లు మద్యం సేవించారా అన్నదానిపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకటరెడ్డి మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుమ్మళ్ళదిబ్బ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల ఆటల పోటీలకు గుమ్మళ్ళదిబ్బ ఉన్నత పాఠశాల విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా దేవి తెలిపారు. ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఖోఖో పోటీల్లో జిల్లా తరఫున తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులతోపాటు, వీరికి క్రీడల్లో ఉత్తమ శిక్షణ ఇస్తున్న పీడీ మధుసూదనరావు, పీఈటీ అజయ్‌లను ఆమె అభినందించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ఉలవపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపట్టపుపాలెంకు చెందిన యువకుడు రాజు సముద్రంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన రాయల్ చంద్రయ్య, రాజులు తమ సొంత ఫైబర్ బోటులో చేపల వేటకు వెళ్లారు. తిరిగి ఉదయం ఒడ్డుకు చేరే క్రమంలో అలల ఉధృతికి ఫైబర్ బోటు తిరగబడింది. ఈ ఘటనలో నీటిలో మునిగిన రాజు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి మత్స్యకారులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్యను రాజును బయటకు తీసుకొని వచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న రాజుని ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతుడు రాజు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్బన్ కాంక్లేవ్ సదస్సుకు నెల్లూరు కమిషనర్

నెల్లూరు(సిటీ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో శనివారం నిర్వహించిన అర్బన్ కాంక్లేవ్ - 2025 సదస్సుకు నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ హాజరయ్యారు. పట్టణ, నగర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన సేవలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇందులో చర్చించారు. పురపాలక శాఖకు చెందిన రాష్ట్ర ఉన్నతాధికారులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఎక్కాలంటే ఎత్తు.. దిగాలంటే దిగులు !

● 'పల్లె వెలుగు' బస్సు మెట్లతో ఇక్కట్లు

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన ఓ పల్లె వెలుగు బస్సు ప్రయాణీకులకు భారంగా మారింది. ఈ బస్సు ఎక్కాలన్నా.. దిగాలన్నా ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఎందుకో తెలుసా? ఉదయగిరి-సీతారామపురం మార్గంలో తిరిగే ఈ బస్సు ద్వారం వద్ద మెట్లు చాలా ఎత్తులో ఉన్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఎక్కాలన్నా.. దిగాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు తలుపు కూడా లేకపోవడంతో చలి గాలికి ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా డిపో అధికారులు స్పందించి బస్సు ద్వారం వద్ద మెట్ల ఎత్తు తగ్గించడంతోపాటు తలుపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మెట్లు ఎత్తుగా.. డోరు ఖాళీగా ఉన్న ఆర్టీసీ బస్సు

పీఆర్ ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నెల్లూరులోని పీఆర్‌ఎస్‌ఈ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎం బాబురావు, ఉపాధ్యక్షుడిగా ఓ రమేష్, ప్రధాన కార్యదర్శిగా కే సుధాకర్‌రావు, కోశాధికారిగా వై వాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకేవీ ప్రసాద్ ఎన్నికయ్యారు.

దీపం పరంజ్యోతి స్వరూపం

● సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతి ● ముగిసిన కార్తీక మాస లక్ష దీపోత్సవం ● పాల్గొన్న మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దీపం పరంజ్యోతి స్వరూపమని విశాఖ సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. కార్తీక మాసంలో భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి, శివకేశవులను పూజిస్తే వారి అనుగ్రహం తప్పక లభిస్తుందని వివరించారు. ఒక్క కార్తీక మాసంలోనే కాకుండా ప్రతీ రోజూ సంధ్య వేళ మహిళలు దీపారాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం శనివారంతో ముగిసింది. చివరి రోజు రాత్రి రామానంద భారతీ స్వామి ఆకాశ దీపాన్ని వెలిగించి భక్తులకు అభిభాషణ చేశారు. అగ్ని స్వరూపుడైన అరుణాచలేశ్వరుడి ఆరాధనే లక్ష దీపోత్సవ లక్ష్యమని తెలిపారు. మంచి సంకల్పంతో ప్రారంభించిన లక్ష దీపోత్సవానికి ప్రకృతి సహకరించిందని, ఈ కార్యక్రమంతో జిల్లా ప్రజలందరికీ మంచి జరుగుతుందంటూ ఆశీస్సులు అందజేశారు. పదేళ్లుగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులకు శివకేశవుల అనుగ్రహం లభిస్తుందని మంగళా శాసనాలు చేశారు. కాగా, చివరి రోజు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ హాజరయ్యారు. వీరు నాగేశ్వరస్వామి జ్యోతిర్లింగం, పండరీనాథ్ పాండు రంగస్వామికి పూజలు చేశారు. ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. 501 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే చండీ హోమం కూడా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం విశేష పూజలు స్పటిక లింగానికి రుద్రాభిషేకాలు జరిగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పండరి నాథుడి సన్నధిలో రామానంద భారతి స్వామి, మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల తదితరులు

● మనోహరంగా మల్లన్న కల్యాణం

శ్రీశైలం నుంచి వచ్చిన మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవం గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ బృందం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఏర్పాట్లను దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు, గంధం సునీల్‌కుమార్, ఆశం విజయసారథి పర్యవేక్షించారు.



లక్ష దీపోత్సవంలో భాగంగా దీపాలు వెలిగిస్తున్న మహిళలు



లక్ష దీపోత్సవంలో నిర్వహించిన ఛండీహోమం